RNI NO:TELTEL/ 2023/89546

# సూర్య రేఖ
తెలుగు దినపత్రిక



## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం
సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 125 | పేజీలు : 8 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 18 డిసెంబర్ 2024 | వెల : 4/-

# నిరుపేదలకు సాయం!



- వారిని గుర్తించే పనిలో సర్కార్
- భూమిలేని నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం
- రెండు విడతలుగా ఇచ్చే సాయం తొలి దఫా నిధులు ఆరు వేల రూపాయలను ఈ నెల 28న విడుదల
- కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 28ని నిధుల విడుదలకు ముహూర్తంగా ఎంచుకున్నారు
- అసెంబ్లీ సమావేశాల్లో ఈ పథకంపై ప్రభుత్వం క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది
- ఈ ఏడాది మొదట్లోనే ఈ పథకంపై ప్రభుత్వం ప్రకటన చేసింది.

హైదరాబాద్

తెలంగాణలో భూమిలేని నిరుపేదలకు 12 వేల ఆర్థిక సాయం ఇవ్వబోతున్నట్లు రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రకటించింది. రెండు విడతలుగా ఇచ్చే సాయం తొలి దఫా నిధులు ఆరు వేల రూపాయలను ఈ నెల 28న విడుదల చేయనున్నారు. కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిసెంబర్ 28ని నిధుల విడుదలకు ముహూర్తంగా ఎంచుకున్నారు. భూమి ఉన్న రైతులకు ఇప్పటికే ఏటా 12 వేల రూపాయాలను ప్రభుత్వం ఇస్తోంది. కాంగ్రెస్ వచ్చిన తర్వాత ఆ ప్రక్రియకు బ్రేక్ పడింది. దీన్ని సంక్రాంతి నుంచి ఇస్తామంటూ ప్రభుత్వం చెబుతోంది. అంత కంటే ముందు భూమి లేని రైతులకు సాయం చేయాలని భావిస్తోంది. అయితే అర్హుల ఎంపిక చేస్తారు. ఎన్ని కోట్లు ఖర్చు కానుందనే చర్చ మొదలైంది. అసెంబ్లీ సమావేశాల్లో ఈ పథకంపై ప్రభుత్వం క్లారిటీ ఇచ్చే అవకాశం ఉంది. ఈ ఏడాది మొదట్లోనే ఈ పథకంపై ప్రభుత్వం ప్రకటన చేసింది. ఇప్పుడు అమలు చేసేందుకు కసరత్తు చేస్తోంది. అర్హులను ఎలా ఎంపిక చేస్తారు. అర్హులు ఎవరు.. ఎంతమందికి ఈ నిధులు అందజేస్తారనే వివరాలు సభలో ప్రకటించే ఛాన్స్ ఉందని టాక్ నడుస్తోంది. తెలంగాణలో భూమి లేని పేదలను గుర్తించేందుకు ఎలాంటి సర్వే ఇప్పటి వరకు ప్రభుత్వం చేపట్టలేదు. పదేళ్లుగా చాలా రకాల సర్వేలు ప్రకటించినప్పటికీ ఈ భూమి లేని నిరుపేదల విషయంలో ఎలాంటి లెక్కలు లేవని తెలుస్తోంది. ఈ మధ్య ప్రభుత్వం - మిగతా3లో



## ఈ నెల 19న కాంగ్రెస్ ఎంపీలతో రాహుల్‌గాంధీ భేటీ

- పార్లమెంట్ హౌస్ అన్నెక్సీలో ఈ భేటీ
- వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు, రైతులకు కనీస మద్దతు ధర, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తదితర అంశాలపై పార్లమెంటులో అనుసరించాల్సిన విధానంపై చర్చ
- రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయసభల్లో రాజ్యాంగంపై చర్చ




## జేపీసీకి వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు

- సాధారణ మెజారిటీతో లోక్‌సభ అనుమతి
- జేపీసీకి వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు..
- సాధారణ మెజారిటీతో లోక్‌సభ అనుమతి
- బిల్లును జేపీసీకి పంపడంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించగా అనుకూలంగా 220 ఓట్లు, వ్యతిరేకంగా 149 ఓట్లు
- ఆ ప్రతిపాదనపై ఓటింగ్ నిర్వహించగా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు

# కేటీఆర్ చేసిన తప్పుకు బెయిల్ కూడా రాదు



- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారాక రామావు చేసింది పెద్ద తప్పు
- కేటీఆర్ ఏడేండ్ల వరకు జైల్లోనే ఉండాల్సి వస్తుంది
- కేటీఆర్‌కు బెయిల్ రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మొక్కుతున్నారు
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శబరిమల వెళ్ళటానికి నల్ల దుస్తులు ధరించినట్లుంది
- మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

హైదరాబాద్

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల దుస్తులు ధరించి అసెంబ్లీకి రావటంపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా ఆయన అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద చిట్ చాట్‌గా మాట్లాడారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కల్వకుంట్ల తారాక రామావు చేసింది పెద్ద తప్పు అని, ఆయన జైలుకు వెళ్ళక తప్పదని అన్నారు. కేటీఆర్ ఏడేండ్ల వరకు జైల్లోనే ఉండాల్సి వస్తుందని, ఆయన చేసిన తప్పుకు బెయిల్ కూడా రాదని మంత్రి అన్నారు. కేటీఆర్‌కు బెయిల్ రావాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు మొక్కుతున్నారని, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు శబరిమల వెళ్ళటానికి నల్ల దుస్తులు ధరించినట్లుందని మంత్రి కోమటిరెడ్డి ఎద్దేవా - మిగతా3లో




## సావర్కర్‌ను కాంగ్రెస్ విమర్శించవద్దు

- బీజేపీ, కాంగ్రెస్‌లకు ఠాకరే కీలక సూచన
- సావర్కర్ కు భారతరత్న ఇవ్వాలన్న ఠాకరే
- నెహ్రూను బీజేపీ విమర్శించవద్దని హితవు

# అసెంబ్లీలో అప్పులపై రగడ

- నేతల మధ్య మాటల యుద్ధం
- ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై సభలో రగడ
- గోరంతను కొండత చేసి గ్లోబల్స్ ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని హరీష్
- "అప్పులపై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్ సిద్ధమా?" భట్టి సవాల్
- నల్లచొక్కాలతో అసెంబ్లీకి బీఆర్ఎస్...
- ఎలాంటి చర్చ లేకుండానే మూడు బిల్లులకు శాసనసభ ఆమోదం






హైదరాబాద్

తెలంగాణ అసెంబ్లీలో కాంగ్రెస్ వర్సెస్ బీఆర్ఎస్ అన్నట్టుగా పరిస్థితి మారిపోయింది. అప్పులపై అధికార, ప్రతిపక్షం మధ్య మాటల యుద్ధం తారాస్థాయికి చేరింది. ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై సభలో రగడ చోటు చేసుకుంది. మంగళవారం ఉదయం అసెంబ్లీ మొదలవగా.. స్పీకర్ గడ్డం ప్రసాద్ ప్రశ్నోత్తరాలను చేపట్టారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై మాజీ మంత్రి హరీష్ రావు అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇచ్చారు. 2024 నవంబర్ వరకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు రూ.51,200 కోట్లు అని భట్టి తెలిపారు. అయితే భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై హరీష్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందనేది అవాస్తవమన్నారు. రూ.51 వేల కోట్ల అప్పు చేశామని ఒప్పుకున్నారన్నారు. ఇవాళ మరో రూ.3 వేల కోట్ల అప్పు తీసుకున్నారని.. ఒక్క ఏడాదిలో లక్షా 27వేల కోట్ల అప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.4 లక్షల కోట్ల అప్పులు - మిగతా3లో



## రాష్ట్రపతి ముర్ముకు హైదరాబాద్‌లో గవర్నర్, సీఎం ఘన స్వాగతం

- హైదరాబాద్ చేరుకున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము
- శీతాకాల విడిది కోసం నగరానికి వచ్చిన రాష్ట్రపతి
- ఈ నెల 20న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం

హైదరాబాద్

రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఏపీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ చేరుకున్నారు. హకీంపేట విమానాశ్రయంలో తెలంగాణ గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆమెకు ఘనస్వాగతం పలికారు. రాష్ట్రపతికి స్వాగతం పలికిన వారిలో గవర్నర్, సీఎంతో పాటు మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉన్నారు. రాష్ట్రపతి హకీంపేట నుంచి బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి చేరుకున్నారు. శీతాకాల విడిదిలో భాగంగా రాష్ట్రపతి - మిగతా3లో

# జేపీసీకి వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు




'ఒకే దేశం, ఒకే ఎన్నిక బిల్లును జాయింట్ పార్లమెంట్ కమిటీకి పంపడానికి లోక్‌సభ అనుమతించింది. బిల్లును జేపీసీకి పంపడంపై లోక్‌సభలో ఓటింగ్ నిర్వహించగా అనుకూలంగా 220 ఓట్లు, వ్యతిరేకంగా 149 ఓట్లు వచ్చాయి. దాంతో బిల్లును జేపీసీకి పంపేందుకు లోక్‌సభ ఆమోదం లభించినట్లైంది. పార్లమెంట్ నూతన భవనంలో తొలిసారి ఎలక్ట్రానిక్ ఓటింగ్ విధానం ద్వారా ఓటింగ్ నిర్వహించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్‌పై అనుమానం ఉన్న వాళు ఓటింగ్ స్లిప్‌లతో క్రాస్ చెక్ చేసుకునేందుకు స్పీకర్ అనుమతించారు. దేశంలో లోక్‌సభతోపాటే వివిధ రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఒకేసారి ఎన్నికల నిర్వహించడం కోసం వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును తీసుకొచ్చారు.

ఇది 129వ రాజ్యాంగ సవరణ బిల్లు. కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ ఇవాళ ఉదయం వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టారు. అనంతరం బిల్లుపై సంపూర్ణ అధ్యయనం కోసం జేపీసీ పంపాలని భావిస్తున్నట్లు ప్రతిపాదించారు. ఆ ప్రతిపాదనపై ఓటింగ్ నిర్వహించగా మెజారిటీ సభ్యులు అనుకూలంగా ఓటు వేశారు. దాంతో బిల్లును జేపీసీకి పంపేందుకు లోక్‌సభ అనుమతి లభించినట్లయ్యింది.

**సాధారణ మెజారిటీతో లోక్‌సభ అనుమతి**

ఒకే దేశం-ఒకే ఎన్నిక లక్ష్యంతో దేశమంతా ఒకేసారి నిర్వహించేందుకు రూపొందించిన బిల్లు ఇవాళ లోక్‌సభ ముందుకు వెళ్లింది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లు సహా మరో బిల్లును కేంద్రం మంగళవారం సభలో ప్రశేపెట్టింది. ఈ బిల్లులను కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ సభలో ప్రవేశపెట్టారు. విస్తృత సంప్రదింపులు జరిపేందుకు గానూ పార్లమెంటు ఉభయసభల ఉమ్మడి కమిటీకి ఈ బిల్లును సిఫారసు చేయాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాను మేఘ్వాల్ కోరారు. ఎంపీల సంఖ్య ఆధారంగా ఆయా పార్టీలకు ఈ కమిటీలో చోటు కల్పించనున్నారు. ఏ పార్టీ తరఫున ఎంతమంది సభ్యులు ఉంటారో స్పీకర్ సాయంత్రానికి ప్రకటించనున్నారు. అతిపెద్ద పార్టీగా ఉన్న బీజేపీ నుంచి కమిటీ చైర్మన్ ఉండనున్నారు. కమిటీలో ఉండేందుకు ఎంపీల పేర్లను ఇవాళే ప్రతిపాదించాలని రాజకీయ పార్టీలను స్పీకర్ కోరనున్నారు. ప్రాథమికంగా ఈ కమిటీ కాలపరిమితి 90 రోజులు విధించనున్నారు. తర్వాత ఈ గడువును పొడిగించే అవకాశం ఉంది. కాగా, జమిలి ఎన్నికలు నిర్వహించేందుకు 32 రాజకీయ పార్టీలు మద్దతు ఇవ్వగా, 15 పార్టీలు వ్యతిరేకించినట్టు ఇప్పటికే రామ్‌నాథ్ కోవింద్ కమిటీ ప్రకటించింది. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల అసెంబ్లీలకు, లోక్‌సభకు, స్థానిక సంస్థలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించడమే జమిలి ఎన్నికల ప్రధాన ఉద్దేశం. వాస్తవానికి మన దేశంలో జమిలి ఎన్నికల నిర్వహణ కొత్తదేమీ కాదు. 1952లో తొలి సాధారణ ఎన్నికలు మొదలుకొని, 1967 వరకు లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు చాలావరకు ఒకేసారి ఎన్నికలు జరిగాయి. అయితే అనంతర కాలంలో సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడకపోవడం, గడువుకు ముందే పలు రాష్ట్రాల శాసనసభలను బర్తరఫ్ చేయడం తదితర కారణాలతో జమిలి ఎన్నికలు పట్టాలు తప్పాయి. దీంతో లోక్‌సభ, అసెంబ్లీలకు వేర్వేరుగా ఎన్నికలు జరపడం మొదలైంది.

**రాజకీయ వర్గాల్లో జోరుగా చర్చ**

అసలు జమిలి ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారన్న చర్చ పెద్దయెత్తున జరుగుతున్నది. జమిలి ఎన్నికలకు అపాయింటెడ్ తేదీగా లోక్‌సభ తొలిసారి సమావేశమైన రోజును గుర్తించాలని కోవింద్ కమిటీ సిఫారసు చేసింది. ఈ లెక్కన ఈ లోక్‌సభ తొలి సమావేశం గత జూన్ 24న జరిగింది. అంటే లోక్‌సభ కాలపరిమితి తీరిపోయే నాటికి అంటే జూన్ 24, 2029లోపు జమిలి ఎన్నికలను నిర్వహించాల్సి ఉంటుంది. దీన్ని విశ్లేషిస్తే, 2029లోనే జమిలి ఎన్నికలు ఉండొచ్చని నిపుణులు అంచనా వేస్తున్నారు. ఎన్డీయే కూటమిలో మిత్రపక్షంగా ఉన్న టీడీపీ అధినేత చంద్రబాబు కూడా జమిలి ఎన్నికలు 2029లోనే అంటూ పరోక్షంగా సంకేతాలు ఇచ్చారు. అలాగే, తన పూర్తి పదవీకాలాన్ని వదులుకోవడానికి ప్రధాని మోదీ సిద్ధంగా లేరని, ఈ క్రమంలో 2029లోనే జమిలి ఎన్నికలు ఉండొచ్చని మరికొందరు విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అయితే, 2027లో, 2028లో కూడా జమిలి ఎన్నికల నిర్వహణను కొట్టిపారేయలేమని, బిల్లు చట్టంగా మారాక, ఇది అంత కష్టతరమైన పనేమీకాదని మరికొందరు వాదిస్తున్నారు. ఇదిలాఉండగా.. సాధారణ ఎన్నికలు జరిగిన తర్వాత సమావేశమయ్యే తొలి లోక్‌సభ సమావేశంలో జమిలి బిల్లును రాష్ట్రపతి నోటిఫై చేయాలని, ఆ రోజును అపాయింటెడ్ డేగా తీసుకొంటే.. ఆ తర్వాత ఐదేండ్లకు జమిలి ఎన్నికలు నిర్వహిస్తారన్న వాదనను కూడా కొందరు తెరమీదకు తీసుకొస్తున్నారు. ఇదేజరిగితే, జమిలి ఎన్నికలు 2034లోనే జరుగొచ్చని ఇంకొందరు అభిప్రాయపడుతున్నారు.

# వచ్చే ఏడాది బీజేపీకి కొత్త అధ్యక్షుడు..!

# ఎవరికి అవకాశం కల్పిస్తారో?



కొత్త ఏడాదిలో భారతీయ జనతా పార్టీ నూతన జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకోనున్నట్లు తెలిసింది. ఈ మేరకు ఇప్పటికే అధ్యక్షుడి ఎన్నిక ప్రక్రియను మొదలు పెట్టినట్లు సంబంధిత వర్గాలు తాజాగా వెల్లడించాయి. ఈ ఎంపిక ప్రక్రియ వచ్చే ఏడాది ఫిబ్రవరికల్లా పూర్తి అవుతుందని పేర్కొన్నాయి.

పార్టీ రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే ప్రక్రియను ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగానే ప్రస్తుతం జరుగుతున్న సంస్థాగత ఎన్నికలు సజావుగా సాగుతున్నాయని పార్టీ వర్గాలు తెలిపాయి. సగానికి పైగా రాష్ట్ర యూనిట్లలో పోలింగ్ ప్రక్రియ జనవరి మధ్య నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఫిబ్రవరి చివరికి జేపీ నడ్డా స్థానంలో కొత్త అధ్యక్షుడు బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని ఆ పార్టీ వర్గాలు వెల్లడించాయి. కాగా, ప్రస్తుతం బీజేపీ జాతీయ అధ్యక్షుడిగా జేపీ నడ్డా ఉన్న విషయం తెలిసిందే. 2020లో ఆయన బీజేపీ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించారు. ఇక ఇటీవలే కేంద్రంలో ఎన్డీయే కూటమి మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నడ్డాను కేంద్ర మంత్రి వర్గంలోకి తీసుకున్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ జాతీయ అధ్యక్షుడితోపాటు కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిగానూ వ్యవహరిస్తున్నారు. ఇక పార్టీ చీఫ్ పదవీకాలం మూడు సంవత్సరాలే. దీంతో ఇటీవలే ఆయన పదవీకాలం ముగిసింది. అయితే, 2024 లోక్‌సభ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని నడ్డా పదవీకాలాన్ని పొడిగించారు.

**బీజేపీ కొత్త అధ్యక్షుడు ఎవరు?**

మరోవైపు తదుపరి పార్టీ అధ్యక్షుడు ఎవరన్న దానిపై జోరుగా చర్చ నడుస్తున్నది. కేంద్ర మంత్రులుగా పనిచేస్తున్న వారిలోనే ఒకరికి జాతీయాధ్యక్షుడి బాధ్యతలు అప్పగిస్తారా..? లేక కొత్త వారిని తీసుకుంటారా..? అనే విషయంపై తీవ్రంగా చర్చ జరుగుతోంది. ఇదే సమయంలో రేసులో పలువురి పేర్లు కూడా వినిపిస్తున్నాయి. మహారాష్ట్ర మాజీ మంత్రి, బీజేపీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే పేరు రేసులో ప్రధానంగా వినిస్తున్నది. బీఎల్ సంతోష్ తర్వాత పార్టీ జనరల్ సెక్రటరీల్లో అత్యంత ప్రభావవంతమైన నేతగా తావ్డేకు పేరున్నది. అలాగే తెలంగాణకు చెందిన కే లక్ష్మణ్ కూడా రేసులో ఉన్నారు. ప్రస్తుతం ఆయన పార్టీ ఓబీసీ మోర్చా చీఫ్‌గా వ్యవహరిస్తున్నారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన అనుభవం ఆయనకు ఉన్నది. రేసులో సునీల్ బన్సల్ పేరు కూడా వినిపిస్తున్నది. ఆయన తెలంగాణ, బెంగాల్, ఒడిశా రాష్ట్రాల ఇన్‌చార్జిగా ఉన్నారు. ఎంపీ ఓం మాథుర్ కూడా అధ్యక్ష రేసులో ఉన్నారు. మరోవైపు, పార్టీ తొలి మహిళా అధ్యక్షురాలిగా కేంద్ర మాజీ మంత్రి స్మృతి ఇరానీ నియమితులయ్యే అవకాశమున్నట్టు వార్తలు వస్తున్నాయి.

## ఢిల్లీలోని పలు పాఠశాలలకు బాంబు బెదిరింపులు..
## వారంలో నాలుగోసారి



దేశ రాజధాని ఢిల్లీలో స్కూళ్లకు బాంబు బెదిరింపులు రావడం నిత్యకృత్యంగా మారింది. గత వారం రోజుల్లో ఏకంగా మూడుసార్లు ఢిల్లీ పాఠశాలలకు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. తాజాగా మరోసారి బెదిరింపులు వచ్చాయి. మంగళవారం ఉదయం ఢిల్లీలోని కొన్ని పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చినట్లు ఢిల్లీ పోలీసులు తెలిపారు. దక్షిణ ఢిల్లీలోని ఇండియన్ పబ్లిక్ స్కూల్, నార్త్ వెస్ట్ ఢిల్లీలోని సరస్వతి విహార్‌లో గల ఓ పాఠశాలకు బెదిరింపులు వచ్చినట్లు చెప్పారు. గుర్తు తెలియని వ్యక్తులు ఇ-మెయిల్ ద్వారా బెదిరింపులకు పాల్పడినట్లు పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఆయా పాఠశాలల వద్దకు చేరుకొని విద్యార్థులను, సిబ్బందిని ఖాళీ చేయించారు. అనంతరం బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్ సాయంతో పాఠశాలల ఆవరణలో క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. అయితే, ఈ తనిఖీల్లో ఎలాంటి పేలుడు పదార్థాలూ, అనుమానాస్పద వస్తువులూ లభించలేదు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. పాఠశాలలకు నకిలీ బాంబు బెదిరింపులు రావటం వారంలో ఇది నాలుగోసారి. గత శుక్రవారం ఏకంగా 40 పాఠశాలలకు, శనివారం మరో ఆరు పాఠశాలలకు, అంతకు ముందు నగరంలోని పలు పాఠశాలలు ఇలాంటి బెదిరింపులు వచ్చిన విషయం తెలిసిందే. దక్షిణ ఢిల్లీలోని వసంత్ కుంజ్ ప్రాంతంలో తాను చదువుకుంటున్న స్కూల్‌కు ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపులు పంపినందుకు ఓ విద్యార్థిని శనివారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విద్యార్థికి కౌన్సెలింగ్ నిర్వహించి, అతడి తల్లిదండ్రులను హెచ్చరించారు. వరుస బెదిరింపులతో విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మరోవైపు బాంబు బెదిరింపులపై ఆప్ నాయకుడు అరవింద్ కేజ్రీవాల్ ఇటీవలే స్పందించారు. నగరంలో నెలకొన్న శాంతిభద్రతలపై ప్రజలంతా ఆందోళన చెందుతున్నారని, ఢిల్లీ నేరాలకు రాజధానిగా మారిందని విమర్శించారు.

## నిన్న పాలస్తీనా.. నేడు బంగ్లాదేశ్ బ్యాగ్..
## వినూత్న రీతిలో ప్రియాంక గాంధీ నిరసన




పార్లమెంట్‌కు కొత్తగా ఎన్నికైన కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ వాద్రా పలు అంశాలపై వినూత్న రీతిలో నిరసన తెలుపుతున్నారు. నిన్న 'పాలస్తీనా' బ్యాగ్‌తో పార్లమెంట్‌కు హాజరైన ప్రియాంక.. ఇవాళ 'బంగ్లాదేశ్' బ్యాగ్‌తో దర్శనమిచ్చారు. బంగ్లాదేశ్‌లో హిందూ మైనారిటీలపై జరుగుతున్న దాడులను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు 'బంగ్లాదేశ్ మైనారిటీల పక్షాన నిలవండి' అంటూ రాసి ఉన్న బ్యాగ్‌తో పార్లమెంట్‌కు వచ్చారు. విపక్ష పార్టీలకు చెందిన ఎంపీలు సైతం ఇదే బ్యాగ్‌తో పార్లమెంట్‌కు వచ్చారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఆవరణలో నిరసన తెలిపారు.

**పాలస్తీనా బ్యాగ్‌తో ప్రియాంక గాంధీ..**

ప్రియాంక గాంధీ నిన్న పాలస్తీనా అని రాసి ఉన్న బ్యాగ్‌తో పార్లమెంట్‌కు హాజరయ్యారు. పాలస్తీనా సంఘీభావానికి చిహ్నంగా భావించే పుచ్చకాయ, శాంతి చిహ్నాలు వంటివి ఆ బ్యాగ్‌పై ఉన్నాయి. గత ఏడాది అక్టోబర్‌లో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి పాలస్తీనాలోని గాజాలో ఇజ్రాయెల్ సైనిక చర్యలకు వ్యతిరేకంగా ప్రియాంక గాంధీ గళమెత్తారు. ఇజ్రాయెల్ ప్రభుత్వం గాజాలో 'జాతి హత్య'లకు పాల్పడుతున్నదని ఆరోపించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు తీరును కూడా ఆమె నిందించారు. గత వారం ఢిల్లీలోని పాలస్తీనా రాయబార కార్యాలయం ఛార్జ్ డి అఫైర్స్ అబేద్ ఎల్రాజెగ్ అబు జాజర్‌ను కూడా ఆమె కలిశారు.

## ఈ నెల 19న కాంగ్రెస్ ఎంపీలతో రాహుల్‌గాంధీ భేటీ



లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు, కాంగ్రెస్ ఎంపీ రాహుల్‌గాంధీ ఈ నెల 19న తమ పార్టీ ఎంపీలతో భేటీ కానున్నారు. పార్లమెంట్ హౌస్ అన్నెక్సీలో ఈ భేటీ జరగనుంది. వన్ నేషన్, వన్ ఎలక్షన్ బిల్లు, రైతులకు కనీస మద్దతు ధర, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తదితర అంశాలపై పార్లమెంటులో అనుసరించాల్సిన విధానంపై ఈ సమావేశంలో చర్చించనున్నారు. పార్లమెంట్ శీతాకాల సమావేశాలు ప్రారంభమైనప్పటి నుంచి ఉభయసభల్లో వాయిదాల పర్వం కొనసాగుతున్నది. గౌతమ్ అదానీ అంశం, రైతులకు కనీస మద్దతు ధర తదితర అంశాలపై చర్చకు విపక్షాలు పట్టుబట్టడంతో సభలు వాయిదాపడుతూ వచ్చాయి. చివరకు ఈ నెల 13, 14 తేదీల్లో లోక్‌సభలో, ఈ నెల 16, 17 తేదీల్లో రాజ్యసభలో రాజ్యాంగంపై చర్చ జరిగింది. రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా పార్లమెంట్ ఉభయసభల్లో రాజ్యాంగంపై చర్చ జరిపారు. ఈ సందర్భంగా ఉభయసభల్లో వాడీవేడి చర్చ జరిగింది. రాజ్యాంగాన్ని దేశ పరిస్థితులకు అనుకూలంగా మార్చకుండా కాంగ్రెస్ పాలకులు వందలకొద్ది సవరణలు చేస్తూ వచ్చారని ప్రభుత్వం విమర్శించింది. దేశంలో కోసం ఇంతవరకు ఏమీ చేయని బీజేపీ మాకు రాజ్యాంగం గురించి పాఠాలు చెప్పడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ పార్టీ మండిపడింది. ఈ క్రమంలో ఈ నెల 19న రాహుల్‌గాంధీ కాంగ్రెస్ ఎంపీలతో భేటీ కానుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. రాజ్యాంగంపై చర్చ జరిగిన రెండు రోజులు మినహా ఈ పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఇంతవరకు ఉభయసభలు సజావుగా సాగలేదు. ఇకముందైనా సభాకార్యకలాపాలు సజావుగా సాగుతాయా లేదా..? అనేది అనుమానంగా ఉన్నది.

## సావర్కర్‌ను కాంగ్రెస్ విమర్శించవద్దు



వీర సావర్కర్ కు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని శివసేన (యూబీటీ) అధినేత ఉద్ధవ్ థాకరే డిమాండ్ చేశారు. సావర్కర్ కు బీజేపీ భారతరత్న ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఈ అంశాన్ని బీజేపీ పరిశీలించకపోతే సావర్కర్ గురించి మాట్లాడే హక్కు ఆ పార్టీకి లేనట్టేనని చెప్పారు. అలాగే, సావర్కర్‌ను విమర్శించడాన్ని కాంగ్రెస్ మానుకోవాలని... ఇదే సమయంలో నెహ్రూని విమర్శించడాన్ని బీజేపీ మానుకోవాలని థాకరే సూచించారు. సావర్కర్, నెహ్రూ ఇద్దరూ అప్పటి కాలానికి తగిన నిర్ణయాలు తీసుకున్నారని చెప్పారు. ప్రధాని మోదీ కూడా పదేపదే నెహ్రూ పేరును లేవనెత్తడాన్ని మానుకోవాలని తెలిపారు.

## అమెరికాలో టిక్ టాక్ బ్యాన్

**న్యూయార్క్ :** అమెరికాలో టిక్‌టాక్ కష్టాలు నిరంతరం పెరుగుతూనే ఉన్నాయి. ఇది ఇప్పటికే నిషేధితం అయ్యే ముప్పును ఎదుర్కొంటోంది. ఇప్పుడు అమెరికన్ చట్టసభ సభ్యులు ఈ యాప్‌ను వారి సంబంధిత యాప్ స్టోర్ల నుండి తీసివేయవలసిందిగా యాపిల్, గూగుల్‌లను ఆదేశించారు. అంటే గూగుల్ ప్లేస్టోర్ నుంచి, యాపిల్ యాప్ స్టోర్ నుంచి ఈ యాప్‌ను తీసేయాలన్న మాట. ఇందుకోసం రెండు కంపెనీలకు జనవరి 19వ తేదీ వరకు సమయం ఇచ్చారు. ఇదే జరిగితే అమెరికాలోని ప్రజలు ఇకపై అఫీషియల్ సోర్స్‌ల నుంచి టిక్‌టాక నుంచి డౌన్‌లోడ్ చేయలేరు. అయితే ఈ నిర్ణయం ప్రస్తుత వినియోగదారులపై పెద్దగా ప్రభావం చూపదు.చైనా కంపెనీ బైట్‌డాన్స్ యాజమాన్యంలో టిక్‌టాక్ ఉంది. ఇప్పుడు బైట్‌డ్యాన్స్ అమెరికాలో తన కార్యకలాపాలను కొనసాగించాలనుకుంటే టిక్‌టాక్‌ను విక్రయించాల్సి ఉంటుంది. జనవరి 19వ తేదీలోగా టిక్‌టాక్‌ను వేరే దేశానికి చెందిన కంపెనీకి విక్రయించకపోతే దాన్ని నిషేధించే ప్రమాదం ఉంది. టిక్‌టాక్‌ని పౌరుల భద్రతకు ముప్పుగా అమెరికా పరిగణిస్తోంది. బైట్‌డ్యాన్స్ తన యాప్ ద్వారా ప్రజల వ్యక్తిగత డేటాను దొంగిలించి చైనా ప్రభుత్వానికి ఇచ్చిందని ఆరోపించింది.యూఎస్ పార్లమెంట్ కమిటీలోని ఇద్దరు సభ్యులు జాన్ ముల్నర్, భారతీయ అమెరికన్ రాజా కృష్ణమూర్తి యాపిల్ సీఈవో టిమ్ కుక్, గూగుల్ సీఈవో సుందర్ పిచాయ్‌లకు లేఖ రాశారు. ఇందులో బైట్‌డ్యాన్స్‌కు కావాల్సిన చర్యలు తీసుకునేందుకు తగిన సమయం ఇచ్చామని తెలిపారు. ఇప్పుడు అది చట్టాన్ని అనుసరించకపోతే అమెరికాలో అలాంటి యాప్‌లను యాక్సెస్ చేయడానికి, నిర్వహించడానికి, అప్‌డేట్ చేసే హక్కు దానికి ఉండదు. అందువల్ల చట్టాన్ని గౌరవిస్తూ గూగుల్, యాపిల్ అవసరమైన చర్యలు తీసుకోవాలి.అమెరికా కోర్టు ఆదేశాల తర్వాత అమెరికా చట్టసభ సభ్యులు రాసిన ఈ లేఖ వెలుగులోకి వచ్చింది. ఈ నిర్ణయాన్ని బైట్‌డ్యాన్స్ సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఇక్కడి నుంచి ఉపశమనం పొందవచ్చని బైట్‌డ్యాన్స్ భావిస్తోంది. ఇక్కడి నుంచి కంపెనీకి ఉపశమనం లభించకపోతే అమెరికాలో వ్యాపారం చేయడం కష్టంగా మారుతుంది. అయితే ఇప్పటికే ఉన్న వినియోగదారులు యాప్‌ని ఉపయోగించడం కొనసాగించగలరు. కానీ వారికి ఎలాంటి అప్‌డేట్‌లు లేదా సపోర్ట్ లభించదు.

## ఇండోనేషియా రక్షణమంత్రితో భారత నేవీ చీఫ్ భేటీ.. ఏం చర్చించారంటే..!



ఇండోనేషియా పర్యటనలో ఉన్న భారత నేవీ చీఫ్ అడ్మిరల్ దినేశ్ కే త్రిపాఠి ఆ దేశ రక్షణ మంత్రి, లెఫ్టినెంట్ జనరల్ జాఫ్రీ జంషుద్దీన్‌తో భేటీ అయ్యారు. భారత్-ఇండోనేషియా రక్షణ సంబంధాలకు ఈ భేటీని కీలక ముందడుగుగా చెప్పవచ్చు. భారత్-ఇండోనేషియా మధ్య రక్షణ సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా ఈ సమావేశంలో చర్చించారు. రక్షణ పరిశ్రమలో రెండు దేశాల నడుమ పరస్పర సహకారాన్ని విస్తరించడంపై కూడా ఈ సమావేశంలో చర్చి జరిగింది. భారత నేవీ అధికార ప్రతినిధి ఈ విషయాన్ని మీడియాకు వెల్లడించారు.

## పీకే పార్టీకి గట్టి దెబ్బ..
## కోర్ కమిటీకి మాజీ ఎంపీలు గుడ్‌బై

పాట్నా: వచ్చే ఏడాది బీహార్ అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో 'జన్ సురాజ్' వ్యవస్థాపకుడు ప్రశాంత్ కిషోర్ కు గట్టి దెబ్బ తగిలింది. 125 మంది సభ్యుల జన్ సురాజ్ కోర్ కమిటీకి మాజీ ఎంపీలు దేవేంద్ర ప్రసాద్, మునజిర్ హసన్ మంగళవారంనాడు రాజీనామా చేశారు. ప్రశాంత్ కిషోర్ పనితీరుపై ఈ ఇద్దరు నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. అయితే, కోర్ కమిటీ నుంచి తాము తప్పుకున్నప్పటికీ ఇంకా పార్టీకి వీడలేదని వారు వివరణ ఇచ్చారు. బీహార్ రాజకీయ ముఖచిత్రాన్ని మారుస్తాననే నినాదంతో గత అక్టోబర్ 2వ తేదీన 'జన్ సురాజ్' పార్టీని ప్రశాంత్ కిషోర్ ప్రారంభించారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా మాజీ ఐఎఫ్ఎస్ అధికారి మనోజ్ భారతిని ప్రకటించారు. వచ్చే ఏడాది మార్చిలో పార్టీ సంస్థాగత ఎన్నికలు జరిగేంతవరకూ ఆయన ఈ పదవిలో ఉంటారని తెలిపారు.

# కేటీఆర్ చేసిన తప్పుకు బెయిల్ కూడా రాదు

-మొదటిపేజీ తరువాయి

చేశారు. శబరికి వెళ్లి కేటీఆర్ అరెస్టు అయితే బెయిల్ రావాలని మొక్కుతారని, అంతర్జాతీయ చట్టాల ప్రకారం కేటీఆర్‌కు బెయిల్ వచ్చే ఛాన్స్ లేదని మంత్రి కోమటిరెడ్డి పేర్కొన్నారు. కాగా ఫార్ములా ఈ కారు రేసింగ్ కేసులో బీఆర్ఎస్ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది. మాజీమంత్రి కేటీఆర్ చుట్టూ ఉచ్చు బిగుస్తోంది. ఏ క్షణమైనా కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు ఇచ్చే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా ఇప్పటికే కేటీఆర్‌పై విచారణకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన విషయం తెలిసిందే. కేటీఆర్ అరెస్ట్‌పై రాజకీయవర్గాల్లో హాట్ హాట్‌గా చర్చ జరుగుతోంది. మరోవైపు ఎలాంటి విచారణకైనా సిద్ధమని కేటీఆర్ అంటున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను పెంచేందుకే ఈ కారు రేసింగ్ నిర్వహించామని కేటీఆర్ అన్నారు. అధికారులకు సంబంధం లేదని.. పూర్తి బాధ్యత తనదేనని కేటీఆర్ ప్రకటించారు. దమ్ముంటే ప్రభుత్వం అరెస్ట్ చేసుకోవచ్చని అన్నారు. కొన్నాళ్ళు జైలులో ఉంటే ఏమవుతుందని కేటీఆర్ ప్రశ్నించారు. జైల్లో యోగా చేసుకుని ఫిట్‌గా అయివస్తానని కేటీఆర్ గతంలో అన్నారు.



జైలు నుంచి వచ్చాక పాదయాత్రతో ప్రజల్లోకి వెళ్తానని ప్రకటించారు. ప్రజల పక్షాన ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తునందుకే కేటీఆర్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం టార్గెట్ చేశారని బీఆర్ఎస్ నేతలు అంటున్నారు. ఇంకోవైపు కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే.. రాష్ట్రం అగ్నిగుండం అవుతుందని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. కేటీఆర్‌ను అరెస్ట్ చేస్తే.. రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు సిద్ధమవుతామన్నారు. సీఎం రేవంత్ రెడ్డి తీరును ప్రజల్లోకి తీసుకువెళతామని కారు పార్టీ నేతలు పేర్కొన్నారు. కాగా ఫార్ములా ఈ-కారు రేసు వ్యవహారం పూర్తిస్థాయిలో మాజీ మంత్రి కేటీఆర్ మెడకు చుట్టుకోనుంది. ఈ అంశంలో చట్ట ప్రకారం ముందుకు వెళ్లాలని సర్కారు నిర్ణయించింది. ఈ కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు ఇప్పటికే గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు ఈ వ్యవహారాన్ని ఏసీబీకి అప్పగించారు.. నేడో రేపో కేటీఆర్‌కు ఏసీబీ నోటీసులు జారీ చేయనుంది.. ఈ మేరకు క్యాబినెట్‌లో సుదీర్ఘంగా చర్చ జరిగింది.. సోమవారం అసెంబ్లీ వాయిదా పడిన తర్వాత మధ్యాహ్నం 4.10 గంటల నుంచి 8 గంటల వరకూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన మంత్రివర్గం సమావేశమైంది. ఈ సందర్భంగా ఫార్ములా ఈ-కారు రేసు కేసులో కేటీఆర్‌ను విచారించేందుకు గవర్నర్ అనుమతి ఇచ్చిన విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి మంత్రివర్గ సహచరులకు వివరించారు. ఇందులో జరిగిన అవినీతిపై ఏసీబీ ఇప్పటికే కేసు నమోదు చేసిన విషయాన్ని మంత్రులకు తెలిపారు. అనంతరం ఈ అంశంపై మంత్రుల అభిప్రాయాన్ని సీఎం తెలుసుకున్నారు.

# అసెంబ్లీలో అప్పులపై రగడ

-మొదటిపేజీ తరువాయి

చేశామని చెప్పుకొచ్చారు. గోరంతను కొండత చేసి గ్లోబల్స్ ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని హరీష్ మండిపడ్డారు. ఆదాయాన్ని సమకూర్చడంలో కాంగ్రెస్ పార్టీకి అపారమైన అనుభవం ఉందని.. హామీలను నెరవేర్చడమం పెద్ద సమస్యే కాదని ఎన్నికల ముందు భట్టి విక్రమార్క చెప్పారని గుర్తుచేశారు. అయితే అధికారంలోకి వచ్చాక ఏడాది అయింది హామీలు నెరవేర్చమని అడిగితే అప్పుల పేరు చెప్పి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. రాష్ట్రానికి ఏడు లక్షల కోట్లు అని కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం అంతా తప్పు అని సభ ద్వారా చెబుతున్నట్లు మాజీ మంత్రి తెలిపారు.

**భట్టి సవాల్.. సిద్ధమన్న హరీష్**

అయితే హరీష్ రావు వ్యాఖ్యలపై మంత్రి భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. సభను బీఆర్ఎస్ తప్పుదోవ పట్టిస్తోందని మండిపడ్డారు. అప్పులపై చర్చ జరగాలనే శ్వేతపత్రం విడుదల చేశామన్నారు. "అప్పులపై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్ సిద్ధమా?" భట్టి సవాల్ విసరగా.. అందుకు మాజీ మంత్రి హరీష్ రావు సై అన్నారు. భట్టి సవాల్‌ను స్వీకరిస్తున్నామని.. అప్పులపై చర్చకు సిద్ధమని హరీష్ రావు ప్రకటించారు.

**ప్రివిలేజ్ మోషన్‌పై**

మరోవైపు రేవంత్ ప్రభుత్వంపై తాము ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్ అనుమతించాలని సభలో హరీష్ రావు కోరారు. ఇప్పటికిప్పుడు అప్పులపై చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నట్లు ఆయన తెలిపారు. సమావేశాలు ముగిసేలోపైనా అప్పులపై చర్చించాలని పట్టుబడ్డారు. ప్రభుత్వం చెప్తున్న అప్పులకు, వాస్తవ అప్పులకు తేడా ఉందని హరీష్ రావు స్పష్టం చేశారు.

బీఆర్ఎస్ ఇచ్చిన ప్రివిలేజ్ మోషన్‌పై భట్టి మాట్లాడుతూ.. "బీఆర్ఎస్ సభ్యులా మాపై ప్రివిలేజ్ మోషన్ ఇచ్చేది. బీఏసీ నుంచి బీఆర్ఎస్ వాకౌట్ చేసింది. గడిచిన పదేళ్లు బీఏసీ ఎలా నిర్వహించారో మర్చిపోయారా? గతంలో పాటించిన నిబంధనలే ఇప్పుడూ పాటించాలి కదా ఎవరైనా రూల్స్ బుక్ ప్రకారమే నడవాలి" అని మంత్రి భట్టి వ్యాఖ్యలు చేశారు. ఆర్థిక విధ్వంసం చేసిన బీఆర్ఎస్ నేతలు నీతులు మాట్లాడడం ఏంటి? అని ప్రశ్నించారు. పెండింగ్ బిల్లులు ఉన్నాయని.. ఆ బిల్లులు పెండింగ్‌లో పెట్టింది బీఆర్ఎస్ అని వ్యాఖ్యలు




చేశారు. 40 వేల కోట్ల రూపాయలు బీఆర్ఎస్ ప్రభుత్వం పెండింగ్ పెట్టిందని తెలిపారు. ప్రతి గింజా తామే కొంటామని సివిల్ సప్లయ్‌లో 18 వేల కోట్ల బకాయిలు పెట్టారన్నారు. హరీష్ రావుకు ఎప్పుడు నిజాలు మాట్లాడే అలవాటు లేదని.. హరీష్ రావు అబద్ధాలు చెబితే అలవాటులో పొరపాటు అనుకున్నామన్నారు. శాసనసభ వ్యవహారాల మాజీ మంత్రి ప్రశాంత్ రెడ్డి కూడా అబద్ధాలు మాట్లాడితే ఎలా అని ప్రశ్నించారు. " అప్పుల విషయంలో ప్రభుత్వం చాలా క్లారిటీగా ఉంది. చేసిన అప్పులను దాచే పరిస్థితి లేదు. నిజాలు చెప్తే ప్రివిలేజ్ మోషన్ అంటే ఊరుకోవాలా? ప్రతి ఆరు నెలలకు ఒకసారి బీఆర్ఎస్ పార్టీ నాయకులకు మైండ్ పోతుంది. ప్రజలు ఎన్నిసార్లు తిరస్కరించిన వాళ్లలో మార్పు రావడం లేదు. అప్పులు ఆస్తుల విషయంలో చర్చించడానికి నేను సిద్ధంగా ఉన్నాను. హరీష్ రావు సవాళ్లు స్వీకరిస్తున్నాను చర్చకు నేను రెడీ" అని మంత్రి భట్టి విక్రమార్క స్పష్టం చేశారు.

**నల్లచొక్కాలతో అసెంబ్లీకి బీఆర్ఎస్...**

మరోవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఈరోజు నల్ల చొక్కాలు, చేతులకు బేడీలతో అసెంబ్లీకి వచ్చారు. లగచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వినూత్నంగా అసెంబ్లీకి వచ్చారు. రైతులకు బేడీలు వేస్తారా అంటూ గులాబీ పార్టీ ఎమ్మెల్యేలు నినాదాలు చేశారు.

**ఎలాంటి చర్చ లేకుండానే మూడు బిల్లులకు శాసనసభ ఆమోదం**

విరామం అనంతరం ప్రారంభమైన శాసనసభలో బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగారు. లగచర్ల రైతులను విడుదల చేయాలని, ఈ అంశంపై చర్చకు బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు పట్టుబట్టారు. కానీ స్పీకర్ చర్చకు అనుమతించలేదు. సభ్యుల ఆందోళనల మధ్యనే యంగ్ ఇండియా ఫిజికల్ ఎడ్యుకేషన్, స్పోర్ట్స్ వర్సిటీ బిల్లు, విశ్వవిద్యాలయాల చట్ట సవరణ బిల్లు, తెలంగాణ జీఎస్టీ సవరణ బిల్లులను సంబంధిత మంత్రులు సభలో ప్రవేశపెట్టారు. ఇక ఈ బిల్లులపై ఎలాంటి చర్చ చేపట్టకుండా.. శాసనసభ ఆమోదం తెలిపింది. మూడు బిల్లులకు ఆమోదం అనంతరం రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు.. పర్యాటక రంగంపై స్వల్పకాలిక చర్చను ప్రారంభించారు. అయితే లగచర్ల రైతులను తక్షణమే జైలు నుంచి విడుదల చేయాలని బీఆర్ఎస్ సభ్యులు ఆందోళన చేస్తున్నారు. ఇదేమీ రాజ్యం.. ఇదేమీ రాజ్యం.. దొంగల రాజ్యం, దోపిడీ రాజ్యం అంటూ నినాదాలతో హోరెత్తించారు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.

# సంక్రాంతి తర్వాత రేషన్ కార్డులు

**నల్గొండ :** సంక్రాంతి తరువాత కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీ ప్రక్రియను మొదలు పెట్టబోతునట్లు.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఉదయం శాసన మండలిలో ఈ మేరకు ప్రకటన చేశారు. దాదాపు 10 లక్షల రేషన్ కార్డులు మంజూరు చేయబోతున్నట్టు వెల్లడించారు. ప్రభుత్వ అంచనా ప్రకారం.. కొత్తగా పది లక్షల కొత్త రేషన్ కార్డుల మంజూరు ఉండవచ్చని.. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వ్యాఖ్యానించారు. తద్వారా 31 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని చెప్పారు. కొత్త రేషన్ కార్డుల మంజూరికి రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కులగణన సర్వేను కుడా ఆధారం చేసుకుంటామన్నారు. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరీతో.. ప్రభుత్వంపై అదనంగా రూ.956 కోట్ల భారం పడుతుందన్నారు. ప్రస్తుతం ఉన్న రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులను జారీ చెయ్యబోతున్నట్లు ఉత్తమ్ వెల్లడించారుప్రస్తుతం ఉన్న రేషన్ కార్డులలో అదనపు పేర్ల నమోదుకు.. మీ సేవ కేంద్రం ద్వారా గడిచిన పదేళ్లుగా వచ్చిన 18 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రివర్గ ఉపసంఘం నియమించారని చెప్పారు. తనను ఛైర్మన్‌గా, సహచర మంత్రులు దామోదరం రాజనరసింహ, పొంగులేటి శ్రీనివాసరెడ్డిలు సభ్యులుగా ఉన్నారని వెల్లడించారు. ఈ ఉప సంఘం పలుమార్లు సమావేశమై.. సిఫారసులను కేబినెట్ ఆమోదం కోసం పంపించినట్లు తెలిపారుతెల్ల రేషన్ కార్డుల మంజూరు ప్రక్రియలో సుప్రీంకోర్టుకు సక్సేనా కమిటీ సమర్పించిన సిఫారసులను పరిగణనలోకి తీసుకున్నట్లు ఉత్తమ్ చెప్పారు. అంతే గాకుండా రాష్ట్రంలోని శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు, లోక్‌సభ, రాజ్యసభ సభ్యుల నుండి సేకరించిన సూచనలను కుడా మంత్రివర్గ ఉప సంఘం



పరిగణనలోకి తీసుకున్నట్లు ఆయన చెప్పారు. వీటన్నింటినీ అధ్యయనం చేసిన ఉపసంఘం.. కొత్త తెల్ల రేషన్ కార్డుల మంజూరికి అర్హతా ప్రమాణాలు నిర్ణయిస్తూ చేసిన సిఫారసులు.. కేబినెట్ ముందుంచినట్లు ఆయన వివరించారు.రాష్ట్రంలో ఖాళీగా ఉన్న చౌక ధరల దుకాణాల డీలర్ల భర్తీ ప్రక్రియను చేబడతామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కొత్తగా ఏర్పడ్డ గ్రామ పంచాయతీలతో పాటు తాండాలలో కుడా చౌక ధరల దుకాణాల ఏర్పాటు చేస్తామన్నారు. చౌక ధరల దుకాణాల ద్వారా ఇప్పటి వరకు పంపిణీ చేస్తున్న దొడ్డు రకం బియ్యాన్ని ప్రజలెవ్వరు వినియోగించక పోవడంతో.. దారి మళ్లుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం గుర్తించిందన్నారు. అందుకే తెల్ల రేషన్ కార్డు దారులందరికి ఇకపై సన్న బియ్యం పంపిణీ చేయనున్నట్లు స్పష్టం చేశారు.సన్న బియ్యం బయట మార్కెట్ లో కిలో నలభై రూపాయలకు పైగానే పడుతుంది. అంత సొమ్ము వెచ్చించి బయట మార్కెట్ లో కొనుగోలు చేయడం సామాన్యులకు అసాధ్యమనే చెప్పాలి. అందుకే ప్రభుత్వం ఇచ్చిన రేషన్ బియ్యంతోనే కొందరు కడుపు నింపుకుంటుండగా, మరికొందరు దోసె పిండి కోసం వినియోగించుకుంటున్నారు. ఇంకొందరు రేషన్ బియ్యాన్ని అక్కడిక్కడే విక్రయించి నగదు తీసుకుని బయటపడుతున్నారు. దీంతో రేషన్ బియ్యం వల్ల ప్రయోజనం లేదని, లబ్దిదారులు సంతృప్తి చెందడం లేదని భావించిన ప్రభుత్వం రేషన్ బియ్యం స్థానంలో సన్న బియ్యం ఇవ్వాలని నిర్ణయించింది. బహుశ కొత్త రేషన్ కార్డులు ఫిబ్రవరి నాటికి మంజూరు చేసి ఉగాది నుంచి సన్న బియ్యం పంపిణీ చేయాలని నిర్ణయించినట్లు అందుతున్న సమాచారం బట్టి తెలుస్తుంది. తెలంగాణలో కొత్త రేషన్ కార్డుల కోసం సుదీర్ఘకాలం నుంచి ఎదురు చూస్తున్నారు. రేషన్ కార్డుల స్థానంలో స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం తెలంగాణలో 90 లక్షల తెలుపు రంగు రేషన్ కార్డులున్నాయి. వీటికి అదనంగా మరో పదిహేను లక్షల కార్డులను మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అంటే మొత్తంకోటి రేషన్ కార్డులు ఉంటాయన్న మాట. అయితే ఇందుకోసం కొన్ని అర్హతలను కూడా ప్రభుత్వం నిర్ణయించింది. రేషన్ కార్డుల ద్వారా కేవలం సన్నబియ్యం మాత్రమే కాకుండా సంక్షేమ పథకాలైన ఐదు వందలకే గ్యాస్ సిలిండర్, ఉచిత విద్యుత్తు వంటివి అందించాల్సి రావడంతో కొన్ని అర్హతలను నిర్ణయించారు. సంవత్సరానికి గ్రామీణ ప్రాంతాల్లో అయితే 1.50 లక్షల్లోపు, పట్టణాల్లో రెండు లక్షల రూపాయల లోపు ఆదాయం ఉన్నవారికే తెలుపు రంగు రేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. మొత్తం మీద ఉగాది నుంచి కొత్త రేషన్ కార్డులతో పాటు సన్నబియ్యం పంపిణీ చేయడానికి ప్రభుత్వం సన్నాహాలు చేస్తుంది.తెలంగాణా రాష్ట్రం ఏర్పాటుకు ముందు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తెలంగాణా ప్రాంతంలో.. 91 లక్షల 68 వేల 231 రేషన్ కార్డులు ఉందేవన్నారు. మొత్తం లబ్ధిదారుల సంఖ్య 3.38 కోట్లని ఆయన సభకు వివరించారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం ఇక్కడి నుండి ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు తమ తమ ప్రాంతాలకు తిరిగి వెళ్లారని.. 2 లక్షల 46 వేల 324 రేషన్ కార్డులు రద్దు అయినట్లు ఉత్తమ్ వెల్లడించారు. తెలంగాణా ఏర్పడ్డాక 2.7 కోట్ల లబ్దిదారులకు గాను మొత్తం 89 లక్షల 21 వేల 907 తెల్ల రేషన్ కార్డులు ఉన్నాయన్నారు.

## రాష్ట్రపతి ముర్ముకు హైదరాబాద్‌లో గవర్నర్, సీఎం ఘన స్వాగతం

-మొదటిపేజీ తరువాయి

హైదరాబాద్ వచ్చారు. రాష్ట్రపతి రేపు పలు అభివృద్ధి పనులను ప్రారంభించనున్నారు. ఈ నెల 20న రాష్ట్రపతి నిలయంలో ఎట్ హోం కార్యక్రమం నిర్వహిస్తారు.

## నిరుపేదలకు సాయం!

-మొదటిపేజీ తరువాయి

చేపట్టిన సర్వేలు ఏవీ పూర్తిగా కొలిక్కి రాలేదు. వాటిని ఆధారంగా చేసుకునేందుకు కూడా వీలు లేదు. అందుకే రెవెన్యూ రికార్డులతోపాటు ఉపాధి హామీ పథకాన్ని ఆధారంగా చేసుకుంటుందా అనే అనుమానం ఉంది. ఉపాధి హామీ పథం ప్రకారం రాష్ట్రంలో 53 లక్షళ కుటుంబాల వారికి జాబ్ కార్డులు ఉన్నాయి. ఇందులో చిన్న, సన్నకారు రైతులు కూడా ఉంటారు. అందులో వారిని ఎలా వేరు చేస్తారనేది సస్పెన్స్‌గా మారింది. ఈ లెక్కలతోపాటు రెవెన్యూ రికార్డులు ఆధారంగా లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశం ఉందని అంటున్నారు. ఈ లెక్కల ప్రకారం 40 లక్షల కుటుంబాలను భూమి లేని వారిగా ప్రభుత్వం గుర్తించిందని అంటున్నారు. ఈ లెక్కలు కాసేపు పక్కన పెడితే.. అసలు అర్హులను ఎలా గుర్తిస్తారు. భూమి లేని వారిని ఏ ప్రతిపాదికన ఎంపిక చేస్తారనే చర్చ కూడా ఉంది. ఎంతలా కుదించినప్పటికీ పాతిక నుంచి 30 లక్షల కుటుంబాలకు మాత్రం ఈ పథకాన్ని వర్తింపజేయాల్సి ఉంది. అంటే దాదాపు 15 నుంచి 18 వేల కోట్ల రూపాయలు ఖర్చు అవుతాయి. సంవత్సరానికి అంటే మూడు నుంచి 3వేల ఆరు వందల కోట్లు ఖర్చు పెట్టాలి. రుణమాఫీ, రైతు భరోసా మాదిరిగా కాకుండా ప్రతి నిరుపేదకు న్యాయం జరిగేలా ఈ పథకాన్ని అమలు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. అనవసరమైన కొర్రీలు పెట్టి ప్రజలను మోసం చేయొద్దని సూచిస్తున్నారు. లేకుంటే మరో ప్రజా ఉద్యమం తప్పదని హెచ్చరిస్తున్నారు.

## బీఆర్ఎస్ నేతల నిరసనపై సీతక్క ఇంట్రెస్టింగ్ కామెంట్స్

**హైదరాబాద్ :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లచొక్కాలు ధరించి, చేతులకు బేడీలతో ఈరోజు (మంగళవారం) అసెంబ్లీకి వచ్చారు. లగచర్ల రైతులకు బేడీలు వేసినందుకు నిరసనగా ఆ పార్టీ ఎమ్మెల్యేలు వినూత్నంగా బేడీలు వేసుకుని మరీ సభకు వచ్చారు. అయితే బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిరసనపై మంత్రి సీతక్క ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మంత్రి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు బేడీలు వేశారు తప్పు.. కేటీఆర్, హరీష్ బేడీలు వేసుకోలేదని.. ఈ ఘటనతో కేటీఆర్, హరీష్ దొరతనం మరోసారి బయటపడిందని అన్నారు. నిరసనలో కూడా బీఆర్ఎస్ నేతల్లో సమానత్వం లేదన్నారు. నిరసనల్లో కూడా తమ దురంకారాన్ని ప్రదర్శించారని మండిపడ్డారు. రైతులకు బేడీలు వేయడంపై బీఆర్ఎస్ నేతలకు మాట్లాడే అర్హత లేదన్నారు. టీఆర్ఎస్ హయాంలో రైతులకు కనీసం పదిసార్లు బేడీలు వేశారని గుర్తుచేశారు. కనీసం అప్పుడు అధికారుల మీద చర్యలు కూడా లేవన్నారు. రైతులకు బేడీలు వేసిన అంశంపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయి చర్యలు కూడా తీసుకున్నారని తెలిపారు. సభలో వాళ్ళు పెట్టిన రూల్స్‌పై వాళ్ళే అభ్యంతరం చెప్పడం ఏంటన్నారు. గతంలో వెల్‌లోకి వస్తే సభ నుంచి సస్పెండ్ చేసేవారని.. కానీ ఇప్పుడు వాళ్లు పెట్టిన నిబంధనలనే వాళ్లు కాలరాస్తున్నారంటూ మంత్రి సీతక్క తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.

**హాట్‌హాట్‌గా అసెంబ్లీ సమావేశాలు**

కాగా.. ఈరోజు అసెంబ్లీ సమావేశాలు హాట్‌హాట్‌గా నడిచాయి. రాష్ట్రంలో అప్పుల అంశంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య మాటలయుద్ధం నడిచింది. డిప్యూటీసీఎం భట్టి విక్రమార్క, మాజీ మంత్రి హరీష్ రావులు సవాళ్లు ప్రతిసవాళ్లు చేసుకున్నారు. ఎఫ్ఆర్‌బీఎమ్ రుణాలపై మాజీ మంత్రి హరీష్ రావు అడిగిన ప్రశ్నకు ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క సమాధానం ఇస్తూ 2024 నవంబర్ వరకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చిన రుణాలు రూ.51,200 కోట్లు అని భట్టి తెలిపారు. అయితే భట్టి విక్రమార్క వ్యాఖ్యలపై హరీష్‌రావు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. రాష్ట్రానికి రూ.7 లక్షల కోట్ల అప్పు ఉందనేది అవాస్తవమన్నారు. రూ.51 వేల కోట్ల అప్పు చేశామని ఒప్పుకున్నారన్నారు. ఇవాళ మరో రూ.3 వేల కోట్ల అప్పు తీసుకున్నారని.. ఒక్క ఏడాదిలో లక్షా 27వేల కోట్ల అప్పులు కాంగ్రెస్ ప్రభుత్వం చేసిందని తెలిపారు. బీఆర్ఎస్ హయాంలో రూ.4 లక్షల కోట్ల అప్పులు చేశామని చెప్పుకొచ్చారు. అయితే మాజీ మంత్రి హరీష్ సభను తప్పుదోవ పట్టిస్తున్నారని భట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. "అప్పులపై చర్చకు మేం సిద్ధం.. బీఆర్ఎస్ సిద్ధమా?" అని భట్టి సవాల్ విసరగా.. అందుకు మాజీ మంత్రి హరీష్ రావు సిద్ధమే అని తెలిపారు. భట్టి సవాల్‌ను స్వీకరిస్తున్నామని.. అప్పులపై చర్చకు సిద్ధమని హరీష్ రావు ప్రకటించారు.

## అరెస్ట్ కోసం అన్నా, చెల్లి తహతహ...

**హైదరాబాద్ :** రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా రూపొందించిన తెలంగాణ తల్లి విగ్రహంపై వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు చిక్కులు తప్పేలా లేవు. ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జీవో ప్రకారం తెలంగాణ తల్లిని అవమానించకూడదని తెలిసినా ఎందుకు ధిక్కరించారు? తనంతట తానుగా అరెస్టు కావాలనే ఉద్దేశంతోనే ఈ వ్యాఖ్యలు చేశారా? ఫార్ములా ఈ ? రేస్ విషయంలో కేటీఆర్ అరెస్ట్ తప్పదనే వార్తలు వస్తున్న నేపథ్యంలో ఆయనతో కవిత పోటీ పడుతున్నారా? జీవోను ధిక్కరిస్తున్నానంటూ స్టేట్‌మెంట్ ఇచ్చి మరీ బహిరంగంగా ఎందుకు కామెంట్ చేశారు? ప్రజలను రెచ్చగొట్టే తీరులో ఎందుకు వ్యవహరించారు? ఇలాంటి అనేక సందేహాలు ఉన్నా ప్రభుత్వ ఉత్తర్వులను ఉల్లంఘించినందుకు ఆమెపై చర్యలు తప్పవనే వార్తలు వినిపిస్తున్నాయి. వేర్వేరు రూపాల్లో జగిత్యాలలో స్థానిక ప్రభుత్వ యంత్రాంగానికి ఫిర్యాదులు వస్తున్నందున దానికి అనుగుణంగా ఆమెపై చర్యలు తీసుకునే అవకాశాలు లేకపోలేదు.రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 9న జారీ చేసిన జీవో (నెం. 1946)లో "తెలంగాణ తల్లి చిత్రాన్ని, రూపాన్ని వక్రీకరించడం, వేరే విధంగా చూపించడం నిషేధం. తెలంగాణ తల్లి చిత్ర రూపురేఖలను బహిరంగ ప్రదేశాలలోగానీ, ఇతర ప్రదేశాలలోగానీ, ఆన్‌లైన్‌లోగానీ, సామాజిక మాధ్యమాలలోగానీ, మాటలు లేదా చేతలతో అగౌరవపర్చడం, ధ్వంసం చేయడం, కాల్చడం, అవహేళన చేడం, అవమానించడం లేదా కించపరచడం నేరంగా పరిగణించబడుతుంది" అని స్పష్టంగా పేర్కొన్నది.ఈ విషయాన్ని ఎమ్మెల్సీ కవిత పట్టించుకోలేదు. "ప్రభుత్వ జీవోలను ధిక్కరించి 22 అడుగుల ఉద్యమ తెలంగాణ తల్లి ప్రతిష్ఠాపనకు భూమి పూజ చేస్తున్నా. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన తెలంగాణ తల్లి రూపాన్ని అంగీకరించే ప్రసక్తే లేదు. ఉద్యమ తెలంగాణ తల్లిని గ్రామగ్రామానా ప్రతిష్ఠించుకుంటాం. గెజిట్ ఇచ్చినా, కేసులు పెట్టినా భయపడేది లేదు" అని జగిత్యాలలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో వ్యాఖ్యానించారు. తెలంగాణ తల్లి రూపాన్ని అవమానించేలా వ్యాఖ్యానిస్తే నేరమవుతుందని, ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిసినా ధిక్కరిస్తున్నా అంటూ కామెంట్ చేసి మరీ సవాల్ చేశారు.ఎమ్మెల్సీగా ఉన్న కవిత, ప్రభుత్వ ఉత్తర్వులను స్వయంగా ఉల్లంఘించడంతో పాటు ప్రజలను రెచ్చగొట్టేలా, వారిని ఉద్రేకపరిచేలా బహిరంగ ప్రదేశంలో వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశంగా మారింది. జీవోకు వ్యతిరేకంగా మాట్లాడడం నేరమని తెలిసినా ఘాటు స్వరంతో వ్యాఖ్యానించడంతో స్వయంగా ఆమె అరెస్టును కోరుకుంటున్నారా? అనే మాటలూ స్థానికంగా పొలిటికల్ లీడర్ల నుంచి వినిపిస్తున్నాయి. ఫిర్యాదుల ఆధారంగా ఆమెపై ఎలాంటి చర్యలు ఉంటాయనే చర్చ మొదలైంది. ప్రభుత్వాన్నే సవాల్ చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును ఆమె ప్రస్తావించారు.జీవో ప్రకారం తెలంగాణ తల్లిని అవమానించకూడదని తెలిసినా ఉద్దేశపూర్వకంగా ధిక్కరణకు పాల్పడాన్ని ప్రభుత్వం కూడా సీరియస్‌గానే తీసుకునే అవకాశమున్నది. ఇప్పుడు ఉపేక్షిస్తే ఇంకొందరు కూడా ఇదే తీరులో రెచ్చిపోతారని, శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని, ఇప్పుడు గట్టి చర్యలు తీసుకోవడం ద్వారా పునరావృతం కాకుండా చూసుకోవచ్చన్నది పోలీసులు, ప్రభుత్వ యంత్రాంగం భావన. ఎమ్మెల్సీ కవిత వ్యవహార శైలిపై ఎలాంటి చర్యలుంటాయన్నదే ఇప్పుడు ఆసక్తికరంగా మారింది.తప్పు చేస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ముఖ్యమంత్రి పలుమార్లు హెచ్చరించారు. సినీ హీరో అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేయడంపై వివిధ పార్టీల నేతలు పోలీసుల తీరును తప్పుపట్టినా సీఎం రేవంత్ మాత్రం, చట్టం ముందు అందరూ సమానులే అంటూ ఢిల్లీ వేదికగా క్లారిటీ ఇచ్చారు. నిజానికి అల్లు అర్జున్‌కు పిల్లనిచ్చిన మామ మాకు బంధువు, మా పార్టీకి చెందినవారు అని సీఎం గుర్తుచేశారు.

# సంపాదకీయం

## వలస కూలీల నాట్లు ఊళ్లో కూలీల అగచాట్లు

ఈ సంవత్సరం వర్షాలు సకాలంలో కురవడంతో రాష్ట్రంలో ప్రాంతాలను బట్టి, వాతావరణాన్ని బట్టి సకాలంలో వ్యవసాయ సీజన్ ప్రారంభమైంది. ఉత్తరాంధ్ర, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణ, గుంటూరు, కర్నూలు, ప్రకాశం ప్రాంతాలలో జులై, ఆగష్టు మాసాలలో, దక్షిణ ప్రాంతాలైన నెల్లూరు, చిత్తూరు, కడపలలో లేట్ ఖరీఫ్ అక్టోబర్, నవంబర్ నెలలో ప్రారంభమైంది. ప్రస్తుతం ఈ ప్రాంతాలలో ముమ్మరంగా వ్యవసాయ పనులు జరుగుతున్నాయి. ప్రధానమైన పంట వరి. అలాగే మెట్ట ప్రాంతాలలో వివిధ రకాలైన పంటలు కూడా సాగవుతున్నాయి. గ్రామాల్లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నా స్థానిక వ్యవసాయ కూలీలకు మాత్రం పనులు దొరకడం లేదు. సంవత్సరం మొత్తం మీద 30 రోజుల కూడా కూలీ పనులు వుండటం లేదు. కారణం ముఖ్యంగా వ్యవసాయంలో యంత్రాలు రావడం. పంటల సాగులో మార్పులు రావడం (ఉదా: డ్రమ్ సీడింగ్ చల్లటం లాంటి పనులు). ప్రస్తుతం 'వలస కూలీలు' మరో ముఖ్య కారణం. బయట రాష్ట్రాల నుండి (బెంగాల్, బీహార్) కూలీలు రావడంతో స్థానిక కూలీలకు పనులు దొరకడం లేదు. కూలీలు గ్రామాల్లో పనులు లేకపోవడంతో పట్టణ ప్రాంతాలకు వ్యవసాయేతర పనులకు వెళుతున్నారు. ప్రధానంగా ఇటుకబట్టీ పనులు, భవన నిర్మాణ పనులు, హెూటళ్ళలో క్లీనింగ్ పనులకు, అలాగే పట్టణాల్లో ఇళ్ళలో పాచి పనులకు (మహిళలు) వెళుతున్నారు. ఒక వేళ కూలి దొరికినా కనీస వేతనం వచ్చే పరిస్థితి లేదు. నారువేతలు మొత్తం కాంట్రాక్ట్ పద్ధతిలో ఎక్కువ శ్రమను ధారపోయాల్సిన పరిస్థితి వస్తున్నది. ఉదయం 6.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు ఒళ్ళు హూనం అయ్యేలా పనిచేస్తే కేవలం రూ.500, రూ.600 వచ్చే పరిస్థితి. ఇది ఊళ్ళో కూలీల పరిస్థితి. ఎక్కడో వేల కిలో మీటర్ల దూరం నుండి ప్రధానంగా బీహార్, బెంగాల్ ప్రాంతాల నుండి పేదలు పొట్ట చేత పట్టుకొని మహిళలను, పసిబిడ్డలను తీసుకొని ఇక్కడి గ్రామాలకు వస్తున్నారు. మధ్యవర్తులు, డీలర్లు చూపిన పశువుల కొట్టాలు, పాడుబడిన ఇళ్లు, బస్ షెల్టర్లు, మొండి గోడల మధ్య ప్లాస్టిక్ కవర్లు కప్పుకొని మురికి కూపాలలో, పురుగు, పుట్ర లెక్క చేయకుండా బిక్కు బిక్కుమంటూ దుర్భరంగా జీవిస్తూ కాయకష్టం చేస్తున్నారు. వీళ్ళు కూడా కాంట్రాక్టు పద్ధతులలోనే నాట్లు వేస్తున్నారు. ఒక ఎకరా నారు పెరికి నారు మోసుకొని నాట్లు వేస్తే మధ్యవర్తి రైతు దగ్గర రూ.4500 నుండి రూ.4600 తీసుకుంటారు. డిమాండ్ ఎక్కువైతే రూ.5000 వరకు తీసుకొని వీరికి మాత్రం కేవలం రూ.3200, రూ.3500 మాత్రమే ఇస్తున్నారు. మిగిలిన డబ్బులు వసతుల పేరు మీద (గ్యాస్, బియ్యం, గోధుమ పిండి, కూరగాయలు, ఆటో ట్రాన్స్‌పోర్టు) మధ్యవర్తులు, డీలర్లు కాజేస్తున్నారు. ఒక్క నెల్లూరు జిల్లాలోనే ఈ లేట్ ఖరీఫ్‌లో 9 లక్షల ఎకరాల వరి సాగు జరుగుతుంది. స్థానిక కూలీలు 2 లక్షల ఎకరాల వరకు నాట్లు వేస్తున్నారు. మిగిలిన పొలమంతా కూడా రైతాంగం బెంగాల్ కూలీల చేతనే నాట్లు వేయిస్తున్నారు. వీళ్ళ చేత నాట్లు వేయించుకుంటే రైతుకు ఎటువంటి కష్టం లేకుండా ఇబ్బందులు లేకుండా శనగలు తిని, చెయ్యి కడుక్కున్నట్లుగా అన్ని పనులు కూలీలే చూసుకుంటారు (నారు పీకడం, నారు మోసుకోవడం, సాళ్లు తీయడం లాంటి పనులు). రైతులు కూడా వ్యవసాయానికి నారుమళ్లు సిద్ధం చేసే సమయంలోనే బెంగాల్ కూలీలను దృష్టిలో పెట్టుకొని నార్లు పోసుకుంటున్నారు. ఉమ్మడి నెల్లూరు జిల్లాలో ప్రస్తుతం సుమారు 50 వేల మంది వరకు బెంగాల్ కూలీలు వున్నారంటే పరిస్థితి ఏ స్థితిలో వుందో ఒకసారి ఆలోచించాలి. వ్యవసాయ సీజన్ మధ్యలో వచ్చినా ఇప్పటికి కూడా నెల్లూరు, కావలి, గూడూరు రైల్వే స్టేషన్లలో వలస కూలీలు దిగుతూనే వున్నారు. ప్లాట్‌ఫారమ్‌ల మీద మూటలతో పనికి పిలిచే వారి కోసం స్టేషన్లలో పడిగాపులు కాస్తున్నారు. రాష్ట్రం కాని రాష్ట్రం, జిల్లా కాని జిల్లా, ఊరు కాని ఊరు వచ్చిన కూలీలకు, మరీ ముఖ్యంగా మహిళలకు రక్షణ లేదు. వాళ్ళ అవసరాలకు చాటు మాటు లేదు. అనేక ఇబ్బందులు పడుతున్నారు. అలాగే కొన్ని చోట్ల పసిపిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. అదేవిధంగా పని ప్రదేశంలో ఏదైనా ప్రమాదం జరిగితే ఆదుకునే దిక్కు లేదు. ఈ మధ్యనే నెల్లూరు జిల్లాలో కూలీలు వెళుతున్న ఆటోలు, ట్రాక్టర్లు బోల్తా పడి ఇద్దరు వలస కూలీలు చనిపోయిన పరిస్థితి. మరికొంత మందికి తీవ్రగాయాలై నెల్లూరు ప్రభుత్వ హాస్పిటల్‌లో, మరికొంతమంది ప్రైవేటు హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం వారికి అండగా నిలిచి, చనిపోయిన కూలీలకు రైతుల చేత నష్టపరిహారం కట్టించి, వారి శవాలను వారి స్వగ్రామాలకు పంపించడానికి ప్రయత్నం చేసింది. అలాగే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరింది. ఇంకా అనేక చోట్ల ప్రమాదాలు జరుగుతూనే వున్నాయి. ఇలాంటి పరిస్థితులలో వలస కార్మికులు ఎన్నో కష్టాలు పడుతున్నారు. ఇన్ని కష్టాలు పడి చేసిన శ్రమకు తగిన ఫలితం దక్కుతుందా అంటే అదీ లేదు. ఉదయం 5.00 గంటల నుండి సాయంత్రం 6.00 గంటల వరకు పని చేస్తే వచ్చిన కూలి డబ్బులు కూడా వీళ్ళకు పూర్తిగా దక్కే పరిస్థితి లేదు. దేశానికి అన్నం పెడుతున్న రైతాంగానికి వ్యవసాయ కార్మికులకు పాలకులు మొండి చేయి చూపిస్తున్నారు. పండించిన పంటకు గిట్టుబాటు ధర లేదు. మద్దతు ధర చట్టం చేస్తానని చెప్పిన ప్రధానమంత్రి మాట తప్పి మోసం చేస్తున్నారు. అదే విధంగా వ్యవసాయాన్నే నమ్ముకున్న వ్యవసాయ కూలీలకు 6 గంటలు పని చేస్తే నారువేతల్లో జోన్ల ప్రకారం (మొదటి జోన్‌లో 443 రూపాయలు, రెండవ జోన్‌లో 438 రూపాయలు) కనీస వేతనం ఇవ్వాలని కేంద్ర కార్మిక శాఖ చట్టం చేసి చెబుతున్నా%ా% ఇక్కడ కూలీలకు మాత్రం రూ.200 మించి ఎక్కడా రావడం లేదు. వ్యవసాయ కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని కార్మికశాఖ జీవో విడుదల చేసినా%ా%జిల్లా అధికారులు, మండల అధికారులు, గ్రామ అధికారులు ఎక్కడా ఆ జీవోని కూలీలకు, రైతులకు తెలియజేసి కూలీలకు జీవో ప్రకారం వచ్చే విధంగా చర్యలు చేపట్టడం లేదు. గ్రామాలలో వ్యవసాయ పనులు లేక ఇబ్బందులు పడుతున్న వ్యవసాయ కార్మికుల కోసం 2005లో వామపక్షాలు పోరాడి తెచ్చిన మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి ప్రస్తుత ఎన్.డి.ఏ. ప్రభుత్వం నిధులు తగ్గించడమేగాక, వాటిని కూడా విడుదల చేయకుండా నిర్వీర్యం చేసే కుట్ర పన్నింది. ఈ చట్టం సక్రమంగా గ్రామాలలో అమలు జరిగితే కూలీల వలసలు తగ్గి, వారి జీవన స్థితి మెరుగుపడుతుంది. కానీ ఆ దిశగా ప్రభుత్వాలు చేయడం లేదు. మరోవైపు పేదలకు విద్య, వైద్యం, నిలువ నీడ కూడా లేని పరిస్థితి గ్రామాల్లో ఉంది. రైతులకు మద్దతు ధరకు చట్టం, వ్యవసాయ కార్మికుల సంక్షేమానికి సమగ్ర చట్టం రూపొందించాలి. దాన్ని సక్రమంగా అమలు చేయాలి. అందుకు గ్రామీణ ప్రజలంతా ఐక్యంగా ఉద్యమించాలి.

# నీతినిజాయితీకి నిలువుటద్దం

అయన ఒక గొప్ప స్వాతంత్ర్య సమర యోధుడు. తన కవితలతో ఎందరినో స్వాతంత్ర్య పోరాటం పట్ల కార్యోన్ముఖులను చేసిన మార్గ దర్శకుడు. ఎందరికో మార్గదర్శకు డైన పోరాట యోధుడు. పరాయి పీడనకు, పాలనకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడి స్వేచ్ఛ, విముక్తి కోసం కలం పట్టి, గళమెత్తిన వీరసైనికుడు. ఇంకెందరిలోనో చైతన్య దీపాలను వెలిగించి, సత్యాగ్రహ బాట పట్టించిన స్ఫూర్తి ప్రదాత. నీతికీ నిజాయితీకి నిలువుటద్దం. దేశభక్తి గీతాలు రాసిన నేరానికి పలు మార్లు జైలు కెళ్ళినా, రాయడం మానని ధీరుడు. స్వాతంత్ర్యోద్యమంలో "వందే మాతరం" ఎలా నినాదంగా, ఉత్ప్రేరకంగా పని చేసిందో... అలాగే ఆయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" పాట ప్రతి తెలుగువారి నోటా మార్మోగింది. ఒక విప్లవ గీతమైంది. అలాంటి ప్రజాకవి గరిమెళ్ళ సత్యనారాయణ. తెలుగునాట జాతీయ కవిత్వానికి ఒరవడి పెట్టిన కవి ప్రముఖుడు గరిమెళ్ళ. సబర్మతీ ఆశ్రమంలో, గాంధీజీ ఈ పాటకు అనువాదము చేయించమని కోరినప్పుడు, ఇంగ్లీష్ లోకి అనువదించి టంగుటూరి ప్రకాశం పంతులు "స్వరాజ్యం" పత్రికలో ప్రచురించాడు. స్వాతంత్ర్యోద్యమ కవుల్లో గరిమెళ్ళ సత్యనారాయణది విశిష్ట, అగ్ర స్థానం. దేశభక్తి కవితలు వ్రాసి జైలుశిక్ష అనుభవించిన వారిలో ప్రథముడు గరిమెళ్ళ. అయన గేయాలు జాతీయ వీరరసంతో తొణికిస లాడుతూ పాఠక జనాన్ని ఉర్రూత లూగించాయి. 29 ఏళ్ళకే గేయాలు, రచనలు చేశాడు. స్వాతంత్ర్య పోరాటకాలంలో గరిమెళ్ళ గేయాలు బ్రిటిష్ సామ్రాజ్య వాదానికి వ్యతిరేకంగా ప్రజా హృదయంలోకి శరవేగంగా చొచ్చుకు పోయాయి. స్వరాజ్య గీతాలు, గేయాలు, వ్యాసాలు పదునైన ఛలోక్తులకు ఆయనకు ఆయనే సాటి. గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తా నుండి, విజయనగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడుగా, ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా, ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా, ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకునిగా, ఆనంద వాణికి సంపాదకునిగా ఏ విధులు నిర్వర్తించినా, నిజాయితీకి నిర్భీతికి నీతికి ప్రతీకగా నిలిచాడు. అయన రాసిన "మా కొద్దీ తెల్ల దొరతనం" .... " అలాగే "దండాలు దండాలు భారత మాత" అనే గీతం కూడా ప్రజలను ఎంతగానో జాగృతం చేసి స్వాతంత్ర్య ఉద్యమంలోకి ఉరికే తెగువను కలగ జేసింది. నిజాయితీకి, నిర్భీతికి గరిమెళ్ళ మారుపేరుగా నిలిచాడు. మాకొద్దీ తెల్ల దొరతనం పాట ఆనాడు ప్రతి తెలుగు వాడి నోటా మారు మోగేది. ఆయనంత ప్రసిద్ధినొందిన జాతీయకవి ఆ రోజుల్లో మరొకరులేరు. గరిమెళ్ళ సత్యనారాయణ శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలుక గోనెపాడు గ్రామంలో 1893 జూలై 14న జన్మించాడు. తల్లి సూరమ్మ, తండ్రి వేంకట నరసింహం. గరిమెళ్ళ ప్రాథమిక విద్య స్వగ్రామమైన ప్రియాగ్రహారంలో సాగింది. విజయ నగరం, మచిలీ పట్నం, రాజమహేంద్ర వరం మొదలైనచోట్ల ఉన్నత చదువులు చదివాడు. బి.ఏ. చేశాక గంజాం కలెక్టర్ కార్యాలయంలో గుమస్తాగా కొంతకాలం పని చేశాడు. ఆ తరువాత విజయ నగరం ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయుడిగా కొంతకాలం పనిచేశాడు. అయన స్వేచ్ఛాప్రియత్వం వల్ల ఎక్కువకాలం ఏ



ఉద్యోగమూ చెయ్యలేక పోయాడు. 1920 డిసెంబర్‌లో కలకత్తాలో జరిగిన కాంగ్రెసు మహాసభలో సహాయ నిరాకరణ తీర్మానం అమోదించ బడింది. ఆ వీరావేశంతో ఉద్యమంలోకి దూకిన గరిమెళ్ళ "మా కొద్దీ తెల్లదొరతనం" పాటను రాశాడు. పాట సత్యాగ్రహులకు గొప్ప తెగువను, ఉత్తేజాన్ని కలిగించింది. ఆనాటి రోజుల్లో రాజమండ్రిలో ఈ పాట నకలు కాపీలు ఒక్కొక్కటి బేడా ( 12 పైసలు) చొప్పున అమ్ముడు పోయేవట. ఆనోటా- ఈనోటా ఈ పాట గురించి ఆనాటి బ్రిటీషు కలెక్టరు బ్రేకన్ చెవినపడి ఆయన గరిమెళ్ళను పిలిపించి పాటను పూర్తిగా పాడమన్నాడట. గరిమెళ్ళ కేవలం రచయితే కాదు, గొప్ప గాయకుడు కూడా అయినందున తన కంచు కంఠంతో ఖంగున పాటలు కూడా పాడగా, గరెమెళ్ళ పాట విన్న బ్రిటీషు కలెక్టరు తెలుగుభాష తనకు రాకపోయి నప్పటికీ, ఈ పాటలో ఎంతటి మహత్తర శక్తి ఉందో, సామాన్య ప్రజల్ని సైతం ఎలా చైతన్య పరచ గలదో నేను ఊగించగల నన్నాడట. ఆ పాటను వ్రాసినందుకు గరిమెళ్ళకు ఒక సంవత్సరం కఠిన కారాగార శిక్ష విధించారు. ఆ రోజుల్లో కాంగ్రెసు స్వచ్ఛంద సేవకులు ఖద్దరు దుస్తులు ధరించి, గాంధీటోపి పెట్టుకుని, బారులు తీరి మువ్వన్నెల జెండా ఎగర వేసుకుంటూ...మాకొద్దీ తెల్లదొరతనం- దేవమాకొద్దీ తెల్లదొరతనం అంటూ ఆకాశం దద్దరిల్లేలా పాడుతూ వీధుల్లో కవాతు చేసేవారట. శిక్షపూర్తి చేసుకుని జైలు నుంచి విడుదల అయిన గరిమెళ్ళ మళ్ళీ ప్రజల మధ్య గొంతెత్తి పాడసాగాడు. ప్రజల్ని ఎంతగానో ఆకట్టుకో సాగాడు. ఇది చూసి ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వాధికారులు భయపడ్డారు. గరిమెళ్ళ బయట వుండటం ప్రభుత్వానికి మంచిది కాదని భావించి ఆయనను అరెస్టు చేశారు. కాకినాడ మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచారు. మేజిస్ట్రేట్ రెండు సంవత్సరములు కఠిన కారాగార శిక్ష విధించాడు. గరిమెళ్ళ జైలులో వుండగా 1923 జనవరిలో ఆయన తండ్రి చనిపోయాడు. క్షమాపణ చెబితే విడుదల చేస్తామని చెప్పారట. కాని గరిమెళ్ళ క్షమాపణ చెప్పకుండా జైలులోనే ఉన్నాడు. అంతటి దేశభక్తుడు ఆయన. జైలు నుంచి విడుదల కాగానే ప్రజలు ఆయనకు ఎన్నోచోట్ల సన్మానాలు చేశారు. ఆయన జీవితంలో మధుర ఘట్టం ఇదొక్కటే. అప్పులు పెరగడంతో ఉన్న ఆస్తి అమ్మేసి అప్పులు తీర్చాడు. ఉద్యోగం వదిలేశాక కొంతకాలం ప్రియాగ్రహారంలో గ్రంథాలయ కార్యదర్శిగా పనిచేశాడు. శ్రీ శారదా గ్రంథమాల స్థాపించి పద్దెనిమిది పుస్తకాలు అచ్చువేశాడు. అవి అమ్ముడు పోలేదు. ఆయన ఎక్కువగా రాజమండ్రి, విజయవాడ, మద్రాసులకు తిరుగుతూ వుండడంతో, పట్టించు కోక పోవడం వల్ల వాటిని చెదలు తినేశాయి. వాటి వల్ల కూడా కొంత నష్టం వచ్చింది. 1921లో గరిమెళ్ళ ' స్వరాజ్య గీతములు ' పుస్తకం వెలువడింది. 1923లో హరిజనుల పాటలు, 1926లో ఖండకావ్యములు, భక్తిగీతాలు, బాలగీతాలు మొదలైన రచనలు వెలువడ్డాయి. గరిమెళ్ళ చాలాసార్లు జైలు శిక్ష అనుభవించాడు. జైలులో వుండగా తమిళ, కన్నడ భాషలు నేర్చుకున్నాడు. తమిళ, కన్నడ గ్రంథాలను తెలుగులోకి అనువ దించాడు. ఆంగ్లంలో కూడా గరిమెళ్ళ కొన్ని రచనలు చేశాడు. ఆంగ్లం నుంచి కొన్ని గ్రంథాలను తెలుగులోకి అనువదించాడు. భోగరాజు పట్టాభిసీతారామయ్య ఆంగ్లంలో వ్రాసిన ' ది ఎకనామిక్ కాంక్వెస్ట్ ఆఫ్ ఇండియా' అనే గ్రంథాన్ని తెలుగులోకి అనువ దించాడు. 1937లో చీనా-జపాన్ అనే పుస్తకాన్ని రచించారు. గరిమెళ్ళ జీవనోపాధి కోసం 1933లో మద్రాసు చేరుకున్నాడు. అక్కడ గృహలక్ష్మి పత్రిక సంపాదకుడుగా ఉద్యోగంలో చేరాడు. కొంతకాలం తరువాత అక్కడ మానివేసి ఆచార్య రంగా, వాహిని పత్రికలో సహాయ సంపాదకుడుగా చేరాడు. కొద్ది రోజులతర్వాత ఆంధ్రప్రభలో చేరాడు. కొంతకాలం ఆనందవాణికి సంపాదకుడుగా పనిచేశాడు. కొంతకాలం ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా జీవనం సాగించాడు. స్వాతంత్ర్యానంతరం పాలకుల వల్ల కూడా గరిమెళ్ళకు చెప్పుకో తగిన సహాయం లభించలేదు. దాంతో కొంత మంది మిత్రులు గరిమెళ్ళను ' మాకొద్దీ నల్ల దొరతనం ' అనే గేయం రాయమని అడిగారట. దేశ భక్తుడు, స్వాతంత్ర్య పిపాసి అయిన గరిమెళ్ళ అందుకు అంగీకరించలేదట. గరిమెళ్ళ పేదరికం అనుభవిస్తున్న రోజుల్లో దేశోద్ధారక కాశీనాథుని నాగేశ్వరరావు పంతులు కొంత సహాయ పడ్డాడు. వావిళ్ళ వేంకటేశ్వర శాస్త్రులు ప్రతినెలా ఆయనకు ఆర్థిక సహాయం చేసేవాడు. వివిధ పత్రికలకు, ఆలిండియా రేడియోకి రచనలు చేసి కొంత గడిస్తున్నా ఆయన అవసరాలకు ఆ డబ్బు చాలలేదు. ఒకవైపు పేదరికం, మరోవైపు అనారోగ్యం ఆయనను బాగా దెబ్బతీశాయి. చివరిదశలో ఒక కన్ను పోయింది. పక్షవాతం వచ్చింది. దిక్కులేని పరిస్థితుల్లో కొంతకాలం యాచన మీద బ్రతికాడు. జీవిత చరమాంక దశలో దుర్భర దారిద్ర్యాన్ని అనుభవించిన గరిమెళ్ళ 1952 డిసెంబర్ 18వ తేదీన స్వగ్రామంలో మరణించాడు. పాలకుల తీరుపై పోరు సాగించిన యోధుడుగా గరిమెళ్ళ చరిత్రలో మిగిలి పోయాడు.

# నిత్యపరిశోధకులు చాట్ల శ్రీరాములు

ఆరున్నర దశాబ్దాల పాటు రంగ స్థలమే జీవితంగా బతికిన వ్యక్తి. నాటక రంగంలో కొత్త ప్రక్రియలు ప్రవేశ పెట్టిన నిత్య సాధకుడు, శోధకుడు, బోధకుడు, దర్శకుడు. థియేటర్ నటుడిగా ప్రాచుర్యం పొందాడు. 150 రేడియో నాటికల లోనూ నటించారు. థియేటర్ ఆర్ట్స్ రంగానికి అంకితమైన ప్రసిద్ధ సాహిత్య మరియు సాంస్కృతిక సంస్థ రసరంజని స్థాపనలో కీలక పాత్ర పోషించారు. దేశ, విదేశా లలో అనేక నాటకాలను ప్రదర్శిం చాడు. ఆంధ్రప్రదేశ్ నుండి మానవ వనరుల విభాగం నుండి ఎమెరిటస్ ఫెలోషిప్ అందుకున్న మొదటి కళాకారుడు. ఆయనే చాట్ల శ్రీరాములు. ఆంధ్ర విశ్వ విద్యాలయ రంగస్థల కళల శాఖలో దర్శకుడిగా బాధ్య తలు చేపట్టారు. ఉస్మానియా విశ్వ విద్యాలయంలోనూ బోధించారు. హైదరాబాదు విశ్వ విద్యాలయం, తెలుగు విశ్వ విద్యాలయాల్లో గౌరవ అధ్యాపకులుగా పనిచేశారు. మధు ఫిల్మ్ ఇన్స్టిట్యూట్ లో, అక్కినేని నట శిక్షణాలయంలో అతిథి అధ్యా పకులుగా బోధించారు నాగార్జున, వెంకటేశ్ లు ఆయన శిష్య బృందం లోని వారే కావడం విశేషం.చాట్ల శ్రీరాములు (డిసెంబరు 5, 1931 – డిసెంబర్ 18, 2015) తెలుగు నాటక రంగ నిపుణుడు, ప్రయోక్త, సినిమా నటుడు. శ్రీరాములు గడ్డి అచ్చయ్య, అచ్చమ్మ దంపతులకు 1931 డిసెంబరు 5 తేదీన బెజవాడలో జన్మించిన చాట్ల 12 సంవత్సరాల వయసులో విజయవాడలో దేశిరాజు రామారావు దర్శకత్వంలో ప్రదర్శించిన 'మేవాడు పతనం' అనే హిందీ నాటకంలో ఓ బాలుని పాత్ర ద్వారా రంగస్థల ప్రవేశం చేశారు. బి.కాం. చదువుతున్న రోజుల్లో నటుడు కావాలన్న కాంక్ష, నాటకం పట్ల ఉత్సాహాన్ని పెంచుకొన్నారు. చివరి సంవత్సరంలో ఉన్నప్పుడు విశాఖపట్నంలో ఆంధ్ర విశ్వ విద్యాలయం వారు నిర్వహించే అభ్యుదయ నాటక ఉత్సవాల్లో ఎస్.ఆర్.ఆర్. కళాశాల పక్షాన 'మాస్టర్జీ' నాటకాన్ని ప్రదర్శించగా, శ్రీరాములు ఉత్తమ నటుడిగా బంగారు పతకాన్ని కైవసం చేసు కున్నారు. 1956లో భారతీయ రైల్వే శాఖలో టిక్కెట్ కలెక్టర్‌గా ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. పబ్లిక్ ఎడ్రసింగ్ సిస్టములో బొంబాయి ఆకాశ వాణి లో శిక్షణ పొందారు. లండన్ లోని బ్రిటీష్ డ్రామా లీగ్ లో 1970లో నాటక ప్రయోక్తగా, ఆచార్యునిగా శిక్షణ పొందారు. చాట్ల 1976లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి వైస్ ఛాన్సలర్ ఎం.ఆర్. అప్పారావు కోరికపై స్టేజీ డైరెక్టర్ ఉద్యోగంలోకి ప్రవేశించారు. నాటక రంగంలో ఎన్నో ప్రయో గాలకు అదే నాంది అయింది. మధు ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌కు ప్రధానాచార్యుడుగా, వివిధ కళాసంస్థల్లో సభ్యుడు గా వ్యవహరించాడు.ఆయన నాటక రంగ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగ్గ నాటకం మరో మొహెంజోదారో



. తెలుగు రాష్ట్రాలే కాదు దేశమం తటా సంచలనం సృష్టించిన నాటకం ఇది. రచయిత యన్.ఆర్.నంది. దీనికి చాట్ల దర్శకత్వంతో పాటు శాస్త్రవేత్త పాత్ర పోషించారు. ఇది కమలాదేవి ఛటోపాధ్యాయ పురస్కారానికి ఎంపికైంది. గొల్లపూడి మారుతీ రావు వ్రాసిన 'లావాలో ఎర్రగులాబీ' నాటకాన్ని చాట్ల దర్శకత్వం బంగారానికి తావి అబ్బడం లాంటిదని ఎందరో విమర్శకులు ప్రశంసించారు. చాట్ల ఆనాటి ప్రముఖ నటుడు కె. వెంకటేశ్వర రావుతో కలిసి 'కాళరాత్రి' అనే నాటకానికి దర్శకత్వం వహించారు. కొర్రపాటి గంగాధరరావు రచించిన 'విష కుంభాలు', 'డిటెక్టివ్', 'భవ బంధాలు', 'తెలుగు కోసం' మొదలైన నాటకాల్లో ప్రధాన పాత్రలు పోషించాడు. ఆంధ్ర నాటక కళాపరిషత్తు నుండి రెండు సార్లు ఉత్తమ నటుడి అవార్డు పొందారు.1954 ప్రాంతంలో రససమాఖ్య ప్రదర్శించిన 'దొంగవీరుడు', 'మాస్టర్జీ' మొదలైన నాటకాలకు పన్నెండు బహుమతులు అందుకున్నారు.గొల్లపూడి 'లావాలో ఎర్రగులాబీ', ఆత్రేయ 'మనసు వయసు', భమిడి పాటి రాధాకృష్ణ 'దైవశాసనం', 'సత్య కామేష్ఠి' నాటకాలు శ్రీరాములుకు బాగా పేరు తెచ్చాయి. న్యాయం కావాలి, స్వప్న, సుడి గుండాలు,సంగీత, విక్రం, అగ్నిపుత్రుడు, శిశర, అగ్నిప్రవేశం తదితర చిత్రాలలో చాట్ల నటించారు. చాట్లలోని దర్శకుడు నిరంతర అన్వేషిగా, ప్రతీ నాటకం నాటికలో వైవిధ్యం ఉండాలని ఆశించారు. ఆయన ప్రతిభ ఇంటనే కాదు రచ్చలోనూ గెలిచింది. ఇంగ్లాండు, అమెరికా, పోలాండ్ తదితర దేశాల్లో పర్యటించి, అక్కడ వాళ్లకు శిక్షణ ఇచ్చారు. అనేక విశ్వ విద్యాలయాలు తమ రంగస్థల శాఖకు అధిపతిగా నియమించాయి. ఉమ్మడి రాష్ట్రం లోని తెలుగు విశ్వ విద్యాలయం, ఆంధ్రా విశ్వ విద్యాలయం, ఉస్మానియా విశ్వ విద్యాలయం వంటి కళాశాలలో సుమారు 26 సంవత్సరాల పాటు నాటకరంగ ప్రొఫెసర్ గా విధులు నిర్వహించారు. ఆధునిక తెలుగు నాటకరంగ చరిత్రలో కృత్తివెంటి నాగేశ్వరరావు, ధర్మవరం రామకృష్ణమాచార్యులు, బళ్ళారి రాఘవ, అబ్బూరి రామకృష్ణారావు, డాక్టర్ గరికపాటి రాజారావు, ఎ.ఆర్. కృష్ణ, కె. వెంకటేశ్వర రావు వంటి హేమా హేమీల జాబితాలో చాట్ల శ్రీరాములు పేరు కూడా కలిసిం దంటే ఆయన నటనలో, దర్శకత్వం లో చేసిన అజరామరమైన కృషి, మేదస్సు రంగస్థలానికి నిలువెత్తు దర్పణం. దర్శకత్వంలో ఆయన చాలా ప్రయోగాలు చేశారు. 1970 లో లండన్లోని బ్రిటిష్ డ్రామా లీగ్ చేత ఆయనకు 'నిర్మాత మరియు ఉపాధ్యాయుడు' సర్టిఫికేట్ లభించింది. శ్రీరాములుకు1982 లో కేంద్ర ప్రభుత్వ సంగీత నాటక అకాడమీ అవార్డు, రెండుసార్లు ఉత్తమ నటుడిగా ఆంధ్ర నాటక కళా పరిషత్ అవార్డు లభించింది. 2003లో తంగిరాల కృష్ణప్రసాద్ స్మారక అవార్డు ఎన్టీఆర్ పుర స్కారం, నార్త్ అమెరికా తెలుగు సొసైటీ సత్కారం, రాష్ట్ర నాటక అకాడమీ నుంచి ఉత్తమ దర్శకుడి పురస్కారాలు ఆయనకు లభించిన గౌరవాల్లో కొన్ని మాత్రమే. 2009లో తెలుగు విశ్వ విద్యాలయం ఆయనకు గౌరవ డాక్టరేట్ ఇచ్చింది. శ్రీరాములు సికింద్రాబాద్ రైల్వే ఆసుపత్రిలో చికిత్స పొందుతూ 2015, డిసెంబర్ 18 శుక్రవారం మృతి చెందారు.

# యాసంగి పంటల్లో చీడపీడల నివారణపై అవగాహన





**రామాయంపేట,డిసెంబర్ 17(సూర్యరేఖ)** రామయంపేట రైతు వేదిక నందు వీడియో కాన్ఫరెన్స్ విధానం ద్వారా రాష్ట్ర వ్యవసాయ శాఖ వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల ఆధ్వర్యంలో రైతులకు సాంకేతిక విధానం ద్వారా నేరుగా వ్యవసాయ,అనుబంధ రంగ సాంకేతిక అంశాలపై అవగాహనలో భాగంగా మంగళవారం రైతు నేస్తం కార్యక్రమం ద్వారా వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ముందుగా ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం కీటక విభాగం శాస్త్రవేత్త శ్రీమతి మాలతి యాసంగి సీజన్లో వివిధ పంటలలో సోకేటువంటి చీడపీడల నివారణ సస్యరక్షణ చర్యలతో పాటుగా సమగ్ర సస్యరక్షణ చర్యలను వివరించడం జరిగింది.అనంతరం వివిధ రైతులకు సంబంధించి సోకేటటువంటి చీడపీడలు వాటి నివారణ పద్ధతుల గూర్చి అవగాహన కల్పించడం జరిగింది.అనంతరం కేంద్ర వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జాతీయ సమగ్ర చీడపీడల నివారణ కేంద్రం భారత వ్యవసాయ శాఖ పరిధిలో గల డైరెక్టర్ ఆఫ్ ప్లాంట్ ప్రొటెక్షన్ క్వారెంటైన్ స్టోరేజ్ కార్యాలయం,జాతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో జాతీయ చీడపీడల నిఘా వ్యవస్థ మొబైల్ యాప్ రైతులకు క్షేత్రస్థాయి వ్యవసాయ, శాస్త్రవేత్తలకు,రైతులకు వివిధ పంటల్లో సోకేటువంటి చీడపీడల చిత్రాల సేకరణ వాటిని మొబైల్ యాప్ ద్వారా సేకరించి అధికారులకు పంపించి వాటికి తగినటువంటి సమగ్ర సస్యరక్షణ చర్యలను పొందే విధంగా ఈ యాప్ అందించడం జరిగింది.ఈ యాప్ ద్వారా చీడపీడల గుర్తింపు వాటి చీడపీడల నిఘా సాంకేతిక సలహాలతో పాటు చీడపీడల యజమాన్య పద్ధతులను ఈ యాప్ ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. క్షేత్రస్థాయిలో ఈ యాప్ ద్వారా రైతులకు చీడపీడలను ముందుగానే గుర్తించడం వాటిని సమర్థవంతంగా అరికట్టడం ఒక ప్రాంతం నుంచి చీడపీడల వ్యాప్తిని అరికట్టడం క్షేత్రస్థాయిలోని అధికారులకు చీడపీడల పట్ల సంపూర్ణ అవగాహన కల్పించడం ఈ చీడపీడలపై పూర్తి సమాచారం ఉన్నప్పుడు రాష్ట్రస్థాయిలో వీటి నివారణ కోసం సమగ్ర ప్రణాళిక రచించడం వంటివి.ఈ యాప్ ద్వారా రైతులకు లబ్ధి చేకూరే అవకాశము ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ సహాయ సంచాలకులు రాజ్ నారాయణ,వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సాయికృష్ణ, ప్రవీణ్, సందీప్,రైతులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ కార్మికుల అక్రమ అరెస్టులు..



**నిజాంపేట,డిసెంబర్17(సూర్యరేఖ)** పరిశుద్ధ కార్మికులకు కనీస వేతనం పెంచాలని డిమాండ్ చేస్తూ ఇంద్ర పార్క్ లో నిర్వహించే మహాసభకు బయలుదేరుతున్న తరుణంలో నిజాంపేట పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్ స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మురికివాడలో పనిచేసే మాకు ప్రభుత్వం సరైన గుర్తింపు ఇవ్వడం లేదని..చాలీ చాలని జీతాలతో పూట గడుపుతున్నామని, నిత్యవసరకు ధరలు పెరిగిన మా జీతాలు మాత్రం పెరగడం లేదన్నారు.పారిశుద్ధ కార్మికుల సమస్యల పరిష్కారం కొరకై ఇందిరా పార్కులో తలపెట్టిన మహాసభకు తరలిస్తున్న మమ్మల్ని పోలీసులు అరెస్టు చేయడం దారుణమన్నారు.ఈ అక్రమ అరెస్టులకు భయపడేది లేదని, మా సమస్యలను పరిష్కరించేంతవరకు పోరాటం చేస్తామని ప్రభుత్వానికి వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో కరోబార్ కొండల్ రెడ్డి,పారిశుద్ధ కార్మికులు రవి,ఏసు,బత్తుల రాములు,వాటర్ మెన్ రాజు,కిషన్,మల్లేశం,మైసయ్య,కుమార్,గరుగుల ఎల్లవ్వ, గవ్వల నరసవ్వ,కొమ్మట నరసవ్వ,కొమ్మట శ్యామల,గరుగుల లక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ అధికారుల తనిఖీలు..



**నిజాంపేట,డిసెంబర్17(సూర్యరేఖ)** మండల పరిధిలోని నందిగామ గ్రామంలో ఈనెల 9 న గ్రామంలోని 1-77 ఇంటిలో రేషన్ బియ్యం ఉన్నాయన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించగా ఇంటి యజమాని లేకపోవడంతో ఇంటిని అధికారులు సీజ్ చేయడం జరిగింది. మంగళవారం విజిలెన్స్ డిప్యూటీ తాహసిల్దార్ రాజేశ్వరి,ఎస్సై శ్రీనివాస్ రెడ్డి,ఆర్ఐలు ప్రీతి,ఇమాద్,ల ఆధ్వర్యంలో సీజ్ చేసినటువంటి ఇంటిలో తనిఖీలు చేపట్టగా 15 ప్లాస్టిక్ బ్యాగ్ లలో నూకలు లభించాయని అందులో 30 కేజీల మిక్సిడ్ రైస్ ఉన్నాయన్నారు. వీటిని సివిల్ సప్లై అధికారులకు పంపించడం జరుగుతుందని తదుపరి విచారణ నిమిత్తం చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ జయపాల్ రెడ్డి,తాహసిల్దార్ స్టాప్ సత్యనారాయణ,తదితరులు పాల్గొన్నారు.

## వరి నర్సరీలను పరిశీలించిన వ్యవసాయ అధికారి..



**నిజాంపేట,డిసెంబర్17(సూర్యరేఖ)** మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మంగళవారం మండల వ్యవసాయ అధికారి మద్దూరి సోమలింగారెడ్డి, వరి నర్సరీలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. వరి నర్సరీలో అక్కడక్కడ అగ్గి తెగులు లక్షణాలను గమనించడం జరిగిందన్నారు.అదేవిధంగా రెండు మూడు రోజుల నుంచి చలి తీవ్రత బాగా ఉండటం వలన వరి నర్సరీలలో ఆకు కొన భాగాలు ఎర్రబారడం జరుగు తుంది.కావున రైతు సోదరులు నర్సరీలో ఉదయాన్నే నీరు తీసివేసి వెచ్చటి బోరు వీటిని వదలాలని సూచించారు. అదేవిధంగా రైతులు అగ్గి తెగులు మచ్చలను గమనించిన ట్లయితే ట్రై సైక్లోజోల్ అనే మందులు 0.6 గ్రామ్ ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలని,నర్సరీలో చలి తీవ్రత వలన సూక్ష్మధాతు లోపాలు వస్తాయి కావున ఫార్ములా-4 పౌడర్ ను 2.5గ్రాములు ఒక లీటర్ నీటికి కలిపి పిచికారి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో వ్యవసా య విస్తీర్ణ అధికారి రాజు,రైతులు పాల్గొన్నారు.

## క్రీడాకారులకు ఏకరూప దుస్తులను అందచేసిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు

**పులిమామిడి నవీన్ గుప్త**



**శివంపేట్,డిసెంబర్17(సూర్యరేఖ)** సిఎం కప్ లో భాగంగా మండల స్థాయి ఖో-ఖో పోటీలో గెలుపొంది జిల్లా స్థాయి పోటీకి వెళ్లిన శివంపేట మండల ఖో- ఖో జట్టుకి (15 మంది కి)ఏకరూప దుస్తులు (జెర్సీ డ్రెస్)లను మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పులిమామిడి నవీన్ గుప్త అందజేశారు.ఈ సందర్భంగా నవీన్ గుప్త మాట్లాడుతూ...రాష్ట్రంలో క్రీడ,క్రీడాకారులను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న క్రీడలకు తనవంతు బాధ్యతగా క్రీడాకారులకు ఏకరూప దుస్తులు అందించడం జరిగిందని తెలిపారు. క్రీడాకారుల కు భవిష్యత్తులో ఎలాంటి సహకారం అందించడానికి అయిన సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ నవీన్ గుప్త అందిస్తున్న సహకారానికి కృతజ్ఞతలు తెలియచేశారు.


## లగ చర్ల రైతులపై అరెస్టు చేయడం హేయమైన చర్య

**బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు నియోజకవర్గ ఇన్చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి..**



**నిజాంపేట,డిసెంబర్17(సూర్యరేఖ)** లగ చర్ల రైతులపై అరెస్టు చేయడం హేయమైన చర్య అని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మెదక్ నియోజకవర్గ ఇన్చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...లగ చర్ల లో దళిత గిరిజన రైతులకు మాకు ఫార్మాసిటీ వద్దు మా భూములను మేము ఇవ్వమని చెప్పినందుకు రైతులను అరెస్టు చేసి 35 రోజులు జైల్లో పెట్టడం దారుణమన్నారు.రైతులపై పోలీసులు థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తూ నానా హింసలకు గురి చేయడంతో ముగ్గురు రైతులకు అనారోగ్యానికి గురికాగా మరో రైతు హీర్య నాయక్ కు గుండెపోటు రావడం ఆ రైతుకు బేడీలు వేసి హాస్పిటల్ కి తీసుకువచ్చి వైద్య పరీక్ష నిర్వహించిన ఘనత కాంగ్రెస్ పార్టీదన్నారు.ఫార్మాసిటీ వద్దు మా భూములకు మాకు కావాలని అన్న పాపానికి సీఎం రేవంత్ రెడ్డి సొంత నియోజకవర్గం అయినటువంటి కొడంగల్ లో ఇలాంటి చర్యలకు పూనుకోవడం హేయమైన చర్య భావిస్తున్నామని బీఆర్ఎస్ పార్టీ పక్షాన ఖండిస్తున్నామన్నారు.ముమ్మాటికి రైతుల వ్యతిరేక ప్రభుత్వం కాంగ్రెస్ అని..లగ చర్ల విషయంలో అసెంబ్లీలో ప్రస్తావిస్తుండగా స్పీకర్ టైం ఇవ్వకపోవడం సిగ్గుచేటు అన్నారు.అన్ని విధాల రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ అని.. రైతులకు రైతుబంధు,రైతులకు సరిగా రుణమాఫీ,చేయక పోవడం పెట్టుబడి సాయం కింద ఇప్పటి వరకు రైతులకు సాయం అందించకపోవడం ప్రతి విషయంలో రైతులను మోసం చేసుకుంటూ కాంగ్రెస్ పార్టీకి ముందుకు పోతుందన్నారు. లగ చర్ల రైతులకు న్యాయం చేసేంతవరకు బీఆర్ఎస్ పార్టీ పోరాడుతుందని మాజీ మంత్రివర్యులు కేటీఆర్, హరీష్ రావు,చెప్పడం జరిగిందని,రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు.దీనిని రాష్ట్ర ప్రజలు కూడా గమనిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, లేనిపక్షంలో ప్రజలే సరైన గుణపాఠం చెప్తారన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం రైతులకు వారి కుటుంబాలకు దృష్టిలో ఉంచుకొని బేషరతుగా వారిపై పెట్టిన కేసులు కొట్టివేసి వారిని విడుదల చేయాలన్నారు.లగ చర్ల రైతులకు న్యాయం చేసేంతవరకు బీఆర్ఎస్ పార్టీ పక్షాన పోరాటం కొనసాగిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## కల్వకుంటలో ఉచిత మెగా వైద్య శిబిరం..



**నిజాంపేట,డిసెంబర్17(సూర్యరేఖ)** మండల పరిధిలోని కల్వకుంట గ్రామంలో మంగళ వారం లక్ష్మక్కపల్లి ఆర్ వివిఎం హాస్పిటల్ వారి ఆధ్వర్యంలో ఉచిత వైద్య మెగా శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈ వైద్య శిబిరంలో బిపి,థైరాయిడ్,షుగర్,తదితర వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను అందజేశామన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. గ్రామంలో సుమారు 50 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను అందజేశామన్నారు. హాస్పిటల్ లో వైద్యం చేయించుకునే వారికి ఉచిత వైద్యంతో పాటు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామన్నారు ఈ అవకాశాన్ని మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్ వివిఎం హాస్పిటల్ మార్కెటింగ్ మేనేజర్ మంచినీళ్ల లక్ష్మణ్, గణేష్ రెడ్డి,పవన్,డాక్టర్లు లాస్యరెడ్డి,పవన్ కళ్యాణ్, హృతిక్ రాహుల్, స్టాఫ్ శృతి,నందిని,గ్రామ కార్యదర్శి కవిత,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పిఎంజి యువసేన ఆధ్వర్యంలో తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తా పెళ్లి రోజు వేడుకలు





**శివంపేట్:డిసెంబర్17(సూర్యరేఖ)** ప్రముఖ సంఘ సేవకులు నిత్యం పార్టీలకు అతీతంగా ప్రజా సేవకే పరితపించే శివంపేట తాజా మాజీ జెడ్పిటిసి పబ్బ మహేష్ గుప్తాఏస్వాతి పెళ్లి రోజు సందర్భంగా బగలముఖి శక్తి పీఠంలో పబ్బ మహేష్ గుప్తా యువసేన ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి కేక్ కట్ చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సమితి మండల అధ్యక్షుడు రమణగౌడ్,తాజా మాజీ సర్పంచ్ పత్రాల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ...పబ్బ మహేష్ గుప్తా చిన్న వయస్సు నుండే నిరుపేదల ప్రజల మధ్యలోనే ఉంటూ తన వ్యాపారంలో సంపాదించే ప్రతి పైసా కష్టాలో ఉన్న వారికీ ఆదుకోవడానికి పరితపించే నాయకుడని తెలిపారు.ఇలాంటి నాయకుడికి భవిష్యత్తులో అండగా ఉండాలని వెల్లడించారు.ఈ కార్యక్రమంలో గ్రామా కమిటీ అధ్యక్షులు లక్ష్మి నర్సయ్య,మాజీ ఉప్ప సర్పంచ్ రాజిపేట పద్మ వెంకటేష్,పాలకమండలి సభ్యులు కొండల్, పోచగౌడ్,కోవూరి వెంకటేష్,సింహం,రామగౌడ్,దొడ్లే అశోక్,త్రినేష్ గౌడ్, కదిర్, అయ్యప్ప స్వామి భక్తులు, యువసేన సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్టిజన్ కార్మికులకు రెగ్యులర్ పోస్టులను కన్వర్షన్ చేయాలి..

**టీవీ ఏసీ జేఏసీ రాష్ట్ర కో-కన్వీనర్ వడ్ల తిరుపతి..**



**నిజాంపేట,డిసెంబర్17(సూర్యరేఖ)** విద్యుత్ సంస్థలో పనిచేస్తున్న ఆర్టిజన్ కార్మికులకు రెగ్యులర్ పోస్టులలో కన్వర్షన్ ఇవ్వాలని టీవీ ఏసి జేఏసీ కో కన్వీనర్ వడ్ల తిరుపతి అన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ కన్వర్షన్ టీవీ ఏసి జెఏసి రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 18న ఇందిరాపార్క్ ధర్నా చౌక్ వద్ద చేపడుతున్న మహాధర్న విజయవంతం చేయాలని కోరారు.రాత్రి పగలు తేడా లేకుండా 24/7 విద్యుత్ కాంతులు వస్తున్నాయంటే దానికి ఆర్టిజన్ కార్మికులే కారణమన్నారు. ఆర్టిజన్ కార్మికులు ప్రతినిత్యం పనిచేయడం వల్లనే నిరంతరం విద్యుత్ సప్లై వస్తుందన్నారు.మన ఆర్టిజన్స్ బతుకులు మారాలంటే అత్యధిక సంఖ్యలో ఆర్టిజన్ లు వచ్చి ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

# తెలంగాణ విద్యాశాఖ సమగ్ర శిక్షణలో కాంట్రాక్టు పద్ధతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులకు రెగ్యులర్ చేయాలి





**ఏఐవైఎఫ్ రంగారెడ్డి జిల్లా సమితి డిమాండ్**

**తుర్కయంజాల్,డిసెంబర్17(సూర్యరేఖ)** తెలంగాణ విద్యా శాఖ సమగ్ర శిక్షలో కాంట్రాక్ట్ పద్దతిలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని,తదితర న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని రంగారెడ్డి కలెక్టరేట్ ముందు వారం రోజులుగా చేపట్టిన దీక్ష శిబిరాన్ని అఖిల భారత యువజన సమాఖ్య ఏఐవైఎఫ్ జిల్లా సమితి బృందం సందర్శించి,సంఘీభావం తెలియజేసారు. అనంతరం ఉద్యోగులు డిమాండ్లతో కూడిన వినతిపత్రంను రాష్ట్ర ప్రభుత్వానికి నివేధించాలని ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పి. శివకుమార్,జిల్లా అధ్యక్షులు మధులు సంయుక్తంగా మాట్లాడుతూ...ద్వితీయ శ్రేణి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని,రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని వారు డిమాండ్ చేశారు.గత 2023 సంవత్సరంలో బీఆర్ఎస్ హయాంలో నాటి తెలంగాణ రాష్ట్ర ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రెగ్యులర్ చేస్తామని హామీని ఇప్పుడు విస్మరించడం శోచనీయమన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా మండల,జిల్లా స్థాయిలో సిస్టం అనలిస్ట్, టెక్నికల్ పర్సన్స్,ఆపరేటర్లు,డేటా ఎంట్రీ,క్లస్టర్ రిసోర్స్ పర్సన్స్,పార్ట్ టైం ఇన్స్ట్రక్టర్స్,స్పెషల్ ఆఫీసర్స్,అటెండెర్స్,తదితర వివిధ విభాగాలలో మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా వందల సంఖ్యలో ఉద్యోగులు పనిచేస్తున్నారని, రాష్ట్ర వ్యాప్తంగా వేలాది మంది చాలీ చాలని జీతాలతో పనిచేస్తున్నా, ఉద్యోగ భద్రత లేదని ఆవేదన వ్యక్తం చేశారు.అదే విధంగా సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని విద్యా శాఖలో విలీనం చేసి రెగ్యులర్ చేయాలని,ఉద్యోగ భద్రతతో కూడిన పేస్కేల్ ఇవ్వాలని, ప్రభుత్వ,విద్యాశాఖ నియామకాలలో స్థిరత్వాన్ని కల్పించాలనే డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా నిరసన దీక్షలు చేస్తున్న ప్రభుత్వం అలసత్వం వహించడం సిగ్గు చేటు అన్నారు.విద్యా శాఖను గాడిలో పెట్టాల్సిన రాష్ట్ర ముఖ్యమంత్రి అదే విద్య శాఖ ఉద్యోగులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఎద్దేవా చేశారు. మద్దతు ఇవ్వాల్సిన జిల్లా విద్యాశాఖ అధికారి, సమ్మె చేస్తున్న సమగ్ర ఆయా శాఖల ఉద్యోగులు కాకుండా వేరే ఇతర ప్రైవేట్ ఉద్యోగులతో శాఖ పనులు చేయించి నిర్ణయిస్తున్నారని,ఈ డీఈఓ చర్యలను ఏఐవైఎఫ్ తీవ్రంగా ఖండిస్తున్నట్లు వారు అన్నారు.సమగ్ర శిక్ష ఉద్యోగుల పట్ల ఉదాసీనత కనబర్చాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా సమగ్ర శిక్ష ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, మహిళా అధ్యక్షురాలు శ్రీలత,నాయకులు సాయి, ఆర్ .లక్ష్మి,పద్మ ,జ్యోతి, శ్రీనివాస్ రెడ్డి,మల్లేష్, ఏఐవైఎఫ్ జిల్లా నాయకులు గణేష్,వీరేశ్,భగత్ సింగ్,మోహన్,భాను ప్రకాష్, యాకయ్య,శ్రావణ్, చిరంజీవి,సైదులు లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం





**అంబేద్కర్ ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..**

**అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ నాయకుల వినతి పత్రం..**

**లగచర్ల రైతుల అరెస్టుకు వ్యతిరేకంగా సర్వత్ర నిరసనలు..**

**కొల్చారం,డిసెంబర్17(సూర్యరేఖ)** వికారాబాద్ జిల్లా దుద్యాల మండలం లగచర్ల గ్రామంలో ఫార్మా కంపెనీ ఏర్పాటు కోసం ప్రభుత్వం తల సేకరణ కార్యక్రమం చేపట్టగా రైతులు దీనిని వ్యతిరేకించి కలెక్టర్ ని అడ్డుకున్న సంగతి తెలిసిందే.. ఈ ఘటనలో పోలీసులు రైతులను దోషులను చేసి వారిపై లాటి చార్జీ,అక్రమ అరెస్టులు చేశారు.దీంతో సర్వత్ర ప్రభుత్వంపై విమర్శలు వెల్లువెత్తాయి.కాగా ఈ కేసులో పోలీసులు ప్రధాన నిందితుడిగా పేర్కొన్న ఈర్యా నాయక్ అనే రైతుకు ఇటీవల గుండెపోటు రావడంతో పోలీసులు ఆయనకు సంకెళ్లు వేసి ఆస్పత్రికి తరలించారు.ఈ సంఘటనతో రాజకీయ పార్టీలు,రైతు సంఘాలలో తీవ్ర నిరసన కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి.కొల్చారం మండల వ్యాప్తంగా పలు గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు రైతులతో కలిసి మంగళవారం నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రంగంపేట, మాందాపూర్,చిన్న ఘనపూర్, వరిగుంతం గ్రామాలలో బీఆర్ఎస్ నాయకులు అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేసి నిరసన తెలిపారు.ప్రజాస్వామ్య దేశంలో అంబేద్కర్ సాక్షిగా ప్రభుత్వం రైతులపై ధమనకాండ కొనసాగిస్తుందన్నారు.లగచర్ల ఘటనలో అరెస్టు చేసిన రైతులను నిర్దోషులుగా ప్రకటిస్తూ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ముత్యంగారి సంతోష్ కుమార్,నరేందర్ రెడ్డి,బాగారెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి,దొడ్ల ఆంజనేయులు, ఆరే రవీందర్, తదితరులు పాల్గొన్నారు.

## దేవునిపల్లిలో ఎక్కడ చెత్త అక్కడే..



**కామారెడ్డి,డిసెంబర్17(సూర్యరేఖ)**కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి గ్రామంలో ఎక్కడ చెత్త అక్కడనే ఉంది.దీంతో ప్రజలు దుర్వాసన దుర్వాసనతో ఇబ్బంది పడుతున్నారు. పక్కనే మల్లికార్జున స్వామి దేవస్థానం శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం ప్రభుత్వ పాఠశాల ఉన్నది.దీంతో భక్తులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. పిల్లలకు ఇబ్బంది కలుగుతుంది. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు చెత్తాచెదారాన్ని తీసేసి భక్తులకు పాఠశాల విద్యార్థులకు ఇబ్బంది కలవకుండా చేయాలని ప్రజలు కోరుతున్నారు అలాగే ఇల్చిపూర్ సరస్వతి మాత ఆలయానికి వెళ్లేదారిలో రోడ్డుకు ఇరువైపులా చెత్తతో నింపివేశారు.సరస్వతి మాత టెంపుల్ కి వెళ్లాలంటే దుర్గం వాసన వస్తుందని భక్తులు వాపోతున్నారు మున్సిపల్ మున్సిపల్ శాఖ అధికారులు తగిన చర్యలు తీసుకొని రోడ్డుపై చెత్త వేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

## కాంగ్రెస్ కు రోజులు దగ్గరపడ్డాయి

**సీఎం రేవంత్ రెడ్డికి ప్రజలే బుద్ధి చెప్తారు..**



**రాజేంద్రనగర్,డిసెంబర్17(సూర్యరేఖ)** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ పాలన చేపట్టాక అభివృద్ధి గాడి తప్పిందని రాజేంద్రనగర్ సర్కిల్ సులేమాన్ నగర్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మహమ్మద్ జమీరుద్దీన్ అన్నారు.లగచర్ల ఘటనలో రైతులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కు వారు వినతి పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా జమీరుద్దీన్ మాట్లాడుతూ...రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ నిరంకుశంగా వ్యవహరిస్తుందని అన్నారు.ప్రజలు కాంగ్రెస్ పాలనతో విసిగిపోయారని వ్యాఖ్యానించారు.త్వరలోనే ప్రజలు కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తారని జోష్యం చెప్పారు.ఈ కార్యక్రమంలో అమీర్, ఖాజా, ఇబ్రహీం, దౌలత్, ఫెరోస్, నజీబ్, ఫయాజ్,మోయిజ్,అబ్దుల్,రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.


## తెలంగాణ సాంస్కృతిక సారథి చైర్ పర్సన్ డాక్టర్ గుమ్మడి,వి.వెన్నెలని కలిసిన ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమ నాయకుడు

**కళాకారుడు కొంతం యాదిరెడ్డి**



**తుర్కయంజాల్,డిసెంబర్17(సూర్యరేఖ)** తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్ పర్సన్ డాక్టర్ గుమ్మడి.వి.వెన్నెలను,ఉద్యమ నాయకుడు కళాకారుడు కొంతం యాదిరెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువతో సత్కరించారు.ఈ సందర్భంగా కొంతం యాదిరెడ్డి మాట్లాడుతూ...ఉద్యమ నాయకులు,కళాకారులు పడుతున్న కష్టాలు వారికి జరిగిన అన్యాయం గురించి వెన్నెలకు వివరిస్తూ ఉద్యమ కళాకారులకు న్యాయం చేయాలని కోరారు.ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఈనెల డిసెంబర్ 21న ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఉద్యమ కళాకారుల ఐక్యవేదిక సమావేశానికి ఉద్యమ కళాకారులు పెద్ద ఎత్తున తరలిరావాలని ఉద్యమ నాయకుడు, కళాకారుడు కొంతం యాదిరెడ్డి పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో కళాకారులు కృష్ణ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ స్టేషన్ల ఫైనల్ లిస్టు..



**శివంపేట్:డిసెంబర్17(సూర్యరేఖ)** శివంపేట మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో నేపథ్యంలో మండలంలోని 37 గ్రామ పంచాయతీలకు సంబంధించిన ఒక్కో వార్డుకు సంబంధించి మొత్తం 312 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయడం జరిగింది.దానికి సంబంధించిన లిస్టును ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో నాగేశ్వర్,సిబ్బంది ఎంపిఓ తిరుపతిరెడ్డి,సూపర్డెంట్ నరేందర్ రెడ్డి,సిబ్బంది ప్రతలను ఏర్పాటు చేయడం జరిగింది..

## ప్రభుత్వ సలహాదారున్ని కలిసిన ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు.



**కామారెడ్డి,డిసెంబర్17(సూర్యరేఖ)**ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీల ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీని మంగళవారం ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర నాయకులు సచివాలయంలో కలిశారు.ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయుల సమస్యలను ఆయనకు వివరించారు. దీనిపై ప్రభుత్వ సలహాదారులు షబ్బీర్ అలీ సానుకూలంగా స్పందించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు కొంగాల వెంకట్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చావన్ సుభాన్ సింగ్, వివిధ జిల్లాల నాయకులు కేశవపురం రమేష్,దుర్గన్న,యాదయ్య,మారుతి, పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇండ్ల సర్వేను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**కొల్చారం,డిసెంబర్17(సూర్యరేఖ)** మండలంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేలో భాగంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పోతంశెట్టిపల్లి గ్రామాన్ని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.అధికారులు చేపడుతున్న సర్వే తీరును పరిశీలించారు. ప్రజలతో మాట్లాడి ఇల్లు లేని వారి వివరాలను ఆరా తీశారు.అర్హులైన పేదలకు న్యాయం జరిగేలా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట ఎంపీడీవో కృష్ణవేణి, ఏపీవో మహిపాల్ రెడ్డి,పంచాయతీ సెక్రటరీ అరుంధతి,తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలీల సమస్యల పరిష్కారానికి చొరవతో పని చేస్తాం





**రాష్ట్ర నూతన కార్యవర్గ అధ్యక్షులు వల్లకటి రాజ్ కుమార్**

**రాజేంద్రనగర్,డిసెంబర్17** రాష్ట్రంలో పద్మశాలీలు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారని,వారి పురోగాభివృద్ధికి తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన కార్యవర్గం కృషి చేస్తుందని కార్యవర్గం అధ్యక్షులు వల్లకటి రాజ్ కుమార్ అన్నారు. మంగళవారం తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని సికింద్రాబాద్ హరిహర కళాభవనంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అధ్యక్షులు వల్లకటి రాజకుమార్, కార్యనిర్వాహక అధ్యక్షులు మచ్చ సుధాకర్ రావు,ఉపాధ్యక్షులు ఏర్వ సత్యనారాయణ, కార్యదర్శులు కాశిగారి యాదగిరి, మునగపాటి వెంకటేశ్వర్లు, కార్యనిర్వాహక కార్యదర్శి దొంత రాజులు ప్రమాణ స్వీకారం చేశారు.ఈ సందర్భంగా అధ్యక్షులు మాట్లాడుతూ. పద్మశాలీల సమస్యల పరిష్కారానికి నూతన కమిటీ పని చేస్తుందని అన్నారు. ఎప్పటికప్పుడు తెలంగాణ ప్రభుత్వం దృష్టికి పద్మశాలీల సమస్యలను తీసుకెళ్లడం జరుగుతుందని అన్నారు. పద్మశాలీలందరూ ఐక్యంగా ఉండి వారి హక్కుల సాధన కోసం పనిచేయాలని ఆయన ఆకాంక్షించారు. కలిసికట్టుగా పనిచేస్తేనే ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి పద్మశాలీలను అన్ని రంగాల్లో ముందుకు సాగేలా కృషి చేయడం జరుగుతుందని అన్నారు.


# అయోధ్యకు శ్రీరామ స్వర్ణ పాదుకల పల్లకి పాదయాత్ర.





**ప్రారంభోత్సవంలో రాజేంద్రనగర్ నియోజకవర్గం కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి**

**రాజేంద్రనగర్,డిసెంబర్17** శ్రీ రామచంద్ర ఆలయంలో శ్రీ శ్రీ మహంత్ రాహుల్ దాస్ మహారాజ్ సంఘం పీఠాధిపతి రామరాజ్యం ఫౌండేషన్ ఆధ్వర్యంలో రామజన్మభూమికి పాదయాత్ర చేపట్టడం సంతోషంగా ఉందని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ పార్టీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో శ్రీరామ స్వర్ణపాదుకల పల్లకి పాదయాత్ర భాగ్యనగర్ నుంచి అయోధ్య వరకు ప్రారంభమైంది.ఈ పాదయాత్ర 14 రోజులపాటు జరగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ కార్యక్రమానికి తోకల శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...లోక కళ్యాణార్థం చేపట్టిన ఈ పాదయాత్ర ఆ శ్రీరాముడి దయతో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.ఇంత మంచి మహత్కార్యంలో తనను భాగస్వామ్య చేయడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు.పల్లకిలో స్వామివారి స్వర్ణపాదుకలను తీసుకెళ్లి సమర్పించడం గొప్ప కార్యక్రమం అని వివరించారు.14 రోజుల పాదుకల పల్లకి పాదయాత్రను తొలిసారిగా చేపడుతున్న నేపథ్యంలో ఈ దైవకార్యాన్ని విజయవంతం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ మేరకు



చొరవ చూపిన రామ రాజ్యం ఫౌండేషన్, రామరాజ్యం సెంట్రల్ ట్రస్ట్ ను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ దీక్ష స్వాములు,అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి

**ఆందోల్,డిసెంబర్17(సూర్య రేఖ)** కుటుంబంతో కలిసి బైక్ పై వెళ్తున్న వ్యక్తిని వేగంగా వచ్చిన బొలెరో వాహనం ఢీకొనడంతో ఓ బైకిస్టు తీవ్ర గాయాలకుగురై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ సంఘటన సంగారెడ్డి జిల్లా రాయికోడ్ లో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..రాయికోడ్ మండలం నల్లంపల్లి గ్రామానికి చెందిన బర్దిపురం మనయ్య ఆదివారం తన భార్య లక్ష్మి,రెండు సంవత్సరాల కొడుకును తీసుకోని న్యాల్కల్ లోని బంధువుల ఫంక్షన్ కు వెళ్తున్నాడు.ఈ క్రమంలో రాయికోడ్ దాటి మూలమాలుపు వద్ద అటుగా వస్తున్న బొలెరో గూడ్స్ వాహనం వేగంగా వచ్చి ఢీకొట్టింది.దీంతో వాహనం నడుపుతున్న మనయ్య తలకు తీవ్ర గాయాలయ్యాయి.మనయ్య కుమారుడు భార్యకు స్వల్ప గాయాలయ్యాయి.దీంతో తోటి ప్రయాణికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మనయ్యను చికిత్స నిమిత్తం 108 వాహనంలో జహీరాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.డాక్టర్ల సలహా మేరకు సంగారెడ్డిలోని బాలాజీ హాస్పిటల్ కు తీసుకెళ్లారు.ఒకరోజు చికిత్స అనంతరం ఉస్మానియా ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. తెల్లవారుజామున ఒంటిగంటకు తుది శ్వాస విడిచినట్లు డాక్టర్లు తెలిపారు.ఆయన మరణంతో గ్రామ ప్రజలు కన్నీటి పర్వంతమయ్యారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## టీపీసీసీ ఆధ్వర్యంలో చలో రాజ్ భవన్

**కైలాస్ శ్రీనివాసరావు పిలుపు**



**కామారెడ్డి,డిసెంబర్17(సూర్య రేఖ)** టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఛలో రాజ్ భవన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు కైలా శ్రీనివాసరావు కోరారు.ఈ మేరకు ఆయన ఓ ప్రకటననువిడుదల చేశారు.బుధవారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.హైదరాబాద్ లోని నెక్లెస్ రోడ్ లోని ఇందిరా గాంధీ విగ్రహం వద్ద భారీ జన సమీకరణతో రాజ్ భవన్ వరకు ప్రదర్శనగా వెళ్లాలని కోరారు.ఈ ప్రదర్శనలు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, ఏఐసీసీ ఇన్చార్జి దీప దాస్ మున్సి,తెలంగాణ రాష్ట్ర మంత్రులు,ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు,సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొంటారని ఆయన తెలిపారు. అమెరికాలో గౌతం అదానిపై వచ్చిన ఆర్థిక అవకతవకలు వ్యాపార ఆర్థిక రంగాలలో దేశ పరువును దెబ్బతీశాయని అదానిపై ఆర్థిక నేరారోపణలు,అవినీతి మోసం, మనీ లాండరింగ్ మార్కెటింగ్ లాంటి అంశాలలో ఆయనపై ఆరోపణలు,దేశ ప్రతిష్టను దెబ్బతీశాయని అన్నారు.అలాగే మణిపూర్ లో వరుసగా జరిగిన అల్లర్లు, విధ్యాంశాలపై మోడీ ఇప్పటివరకు అక్కడికి వెళ్లకపోవడం లాంటి అంశాలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు బుధవారం ఛలో రాజ్ భవన్ కార్యక్రమాలు చేపడుతున్నట్లు కైలా శ్రీనివాసరావు వివరించారు.ఈ అంశాలపై ఏఐసీసీ ఇచ్చిన పిలుపుమేరకు టీపీసీసీ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్రదర్శనకు భారీగా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

## జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్య శిబిరం



**కామారెడ్డి,డిసెంబర్17(సూర్య రేఖ)** జర్నలిస్టులకు ఉచిత కంటి వైద్య శిభిరాన్ని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం హెల్త్ క్యాంపును నిర్వహించారు. జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యుల కంటి సమస్యల పరిష్కారానికి ప్రెస్ క్లబ్ కమిటీ తరపున డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు.ఉదయం 11 గంటల నుండి సాయంత్రం వరకు 130 మంది పైగా జర్నలిస్టులు తమ కళ్ల పరీక్షలు చేయించుకున్నారు.అనంతరం డాక్టర్ అగర్వాల్ మాట్లాడుతూ..చాలామంది దగ్గర చూపు సమస్యతో బాధపడుతున్నారని తెలిపారు.నేత్ర సమస్యలున్న జర్నలిస్టులు వారి కుటుంబ సభ్యులకు అవసరమైన సర్జరీని జర్నలిస్ట్ హెల్త్ కార్డుపై ఉచితంగా చేస్తామని డాక్టర్ అగర్వాల్ కంటి ఆసుపత్రి సిబ్బంది గణేష్ చరణ్ తెలిపారు.ఈ శిభిరంలో సీనియర్ జర్నలిస్టులు,ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

## బీజేపీ బలోపేతానికి బూత్ కమిటీలను పూర్తి చేయాలి..

**సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి శ్రమించాలి..**

**రాజేంద్రనగర్ బీజేపీ కంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి**





**రాజేంద్రనగర్,డిసెంబర్17** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో బీజేపీ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు శ్రమించాలని రాజేంద్రనగర్ నియోజకవర్గం బీజేపీ కాంటెస్టెంట్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి అన్నారు.మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని మైలార్ దేవులపల్లి డివిజన్ బీజేపీ కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బొక్క నర్సింహారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర బీజేపీ నాయకులు నూతన బూత్ కమిటీ సంస్థాగత ఎన్నికలు ఇంచార్జ్ ప్రేమేందర్ రెడ్డితో కలిసి తోకల శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా తోకల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ...నియోజకవర్గంలో బీజేపీ పార్టీ బలంగా ఉందన్నారు.అయితే పార్టీ అధిష్టానం నిర్ణయించిన మేరకు ఈనెల 25వ తేదీలోపు సభ్యత్వ నమోదును పూర్తి చేయాలని సూచించారు.వీలైనంత త్వరగా చొరవతో సభ్యత్వ నమోదు పూర్తి చేసేలా చూడాలని కోరారు.బూత్ కమిటీలను పటిష్టం చేయడం వల్ల బీజేపీ బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.అందరినీ సమన్వయం చేసుకుంటూ పార్టీని ముందుకు తీసుకెళ్లాలని అన్నారు.ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల ఎదురయ్యే సమస్యలపై పోరాడాలని పిలుపునిచ్చారు.అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందేలా చూడాలన్నారు. సంస్థాగతంగా బలంగా ఉన్నప్పుడే ఎన్నికలలో ఆశించిన ఫలితాలు వస్తాయని ఆయన అన్నారు. బూత్‌స్థాయి నుంచే పార్టీని బలోపేతం చేస్తే వచ్చి ఎన్నికల్లో గెలుపు సాధ్యమవుతుందన్నారు.పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని చెప్పారు.ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షుడు బొక్క నరసింహారెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు,మాజీ ఎమ్మెల్యే కె ఎస్ రత్నం, కొలన్ శంకర్ రెడ్డి,ప్రభాకర్,మల్లారెడ్డి, కొమరయ్య,జోగి రవి, దేవేందర్ రెడ్డి,పాపయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# పశువుల్లో పరాన్న జీవుల వల్ల కలిగే నష్టానికి చర్యలు





**ఆ దిశగా శాస్త్రవేత్తలు,పరిశోధకులు పని చేయాలి**

**పశు వైద్య విశ్వవిద్యాలయం వీసీ ఘోష్**

**రాజేంద్రనగర్,డిసెంబర్17** పశువులలో పరాన్న జీవుల వల్ల కలిగే నష్టం రైతులకు ఎంతో బాధ కలిగిస్తుందని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం ఉపకులపతి,పశుసంవర్ధక పాడి పరిశ్రమ, మత్స్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యసాచి ఘోష్ అన్నారు. మంగళవారం రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పీవీ నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయంలో రాజేంద్రనగర్ పశు వైద్య కళాశాల,పరాన్న జీవశాస్త్ర విభాగాల ఆధ్వర్యంలో పశువులలో పరాన్న జీవుల ప్రభావంపై మూడు రోజుల సదస్సును ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కార్యక్రమా న్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. పరాన్న జీవుల ప్రభావాన్ని నివారించడానికి శాస్త్రవేత్తలు, పశు వైద్యులు సమిష్టిగా కృషి చేయాలని అన్నారు.రైతు సోదరులను, పెంపుడు జంతువుల యజమానులను ఆదుకోవాలని సూచించారు. పరిశోధనల ద్వారా పరాన్న జీవుల నివారణకు నూతనంగా ఆవిష్కృతమైన మందులను, యాజమాన్య పద్ధతులను విశ్వవిద్యాలయం విస్తరణ విభాగం ద్వారా పశు వైద్యులకు రైతులకు చేరేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిఏఆర్ పూర్వ డిడిజి కే ఎమ్ఎల్ పాతక్ జీవన సాఫల్య పురస్కారం అందుకున్నారు. వివిధ విభాగాలలో అపూర్వ ప్రతిభ కనబరిచిన అధ్యాపకులకు విద్యార్థులకు పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమాన్ని దిగ్విజయంగా నిర్వహిస్తున్న విశ్వవిద్యాలయం ఫ్యాకల్టీ డీన్ సదస్సు ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఉదయ్ కుమార్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో జాతీయ మత్స్య అభివృద్ధి సంస్థ చీఫ్ విజయ్ కుమార్, బెహరా పీవీ నరసింహారావు, తెలంగాణ రాష్ట్ర పశు వైద్య విశ్వవిద్యాలయం రిజిస్టర్ డాక్టర్ శరత్చంద్ర రాజేంద్రనగర్ పశు వైద్య కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ మాధురి, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ వెటర్నరీ పర్సిటోలజీ అధ్యక్షులు డాక్టర్ శంకరన్,కార్యదర్శి డాక్టర్ అనీష్ యాదవ్ విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ హరికృష్ణ,విస్తరణ సంచాలకులు డాక్టర్ కిషన్ కుమార్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ సర్కార్ కక్షసాధింపు








**రైతులను హింసిస్తే బీఆర్ఎస్ తరపున పోరాడుతాం..**
**బీఆర్ఎస్ అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉంటుంది..**
**లగచర్ల రైతులపై అక్రమ కేసులు ఎత్తేయాలి..**
**డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం సమర్పణ..**
**రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి**

**రాజేంద్రనగర్,డిసెంబర్17** రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ రైతులపై కక్ష కట్టిందని రాజేంద్రనగర్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు పోరెడ్డి ధర్మారెడ్డి వ్యాఖ్యానించారు.ప్రజలు కాంగ్రెస్ పాలనతో సంతృప్తిగా లేరని వ్యాఖ్యానించారు.లగచర్ల రైతులపై అక్రమ కేసులు పెట్టడమే కాకుండా థర్డ్ డిగ్రీ ఉపయోగించి.. జైలులో పెట్టడాన్ని నిరసిస్తూ...బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు...రాజేంద్రనగర్ అంబేద్కర్ చౌరస్తాలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా పోరెడ్డి ధర్మారెడ్డి మాట్లాడుతూ...ప్రజలు కాంగ్రెస్ పార్టీపై ఎన్నో ఆశలతో ఓటు వేసి గెలిపిస్తే వారి ఆశలను,అడిఆశలు చేసిందని అన్నారు. నమ్మి గెలిపించినందుకు ప్రజలతో గోస పెట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.రైతుల సంక్షేమానికి బీఆర్ఎస్ పార్టీ కష్టపడిందని,నేటి కాంగ్రెస్ వారికి ఇబ్బందులను సృష్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు.ప్రజలు అన్ని గమనిస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ తిరిగి అధికారంలోకి రావడం ఖాయమని, కాంగ్రెస్ పతనం ప్రారంభమైందని వివరించారు. రైతులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేసి..జైలులో నిర్బంధించిన రైతులను విడుదల చేసే వరకు పోరాటం చేయాలన్నారు.రైతు లేనిది రాజ్యం లేదన్నారు.రైతులకు బేడీలు వేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం బీఆర్ఎస్‌పై కక్షసాధింపు చర్యలు ఉంటున్నాయని ఆరోపించారు. ఎలాగైనా కేటీఆర్‌ను జైల్లో పెట్టాలని రేవంత్ సర్కార్ ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ సర్కార్ గాలికి వదిలేసిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రీతం రాజ్, నవీన్ కుమార్,గిరిబాబు,నరేందర్, ఉమారెడ్డి, మహమ్మద్ అద్రిస్,కట్టలమండి గౌతమ్,నరేష్ ముదిరాజ్, అశ్వక్, శ్రీను, సారంగపాణి, శ్రీను, కమల్, అక్బర్, సురేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

# అయ్యప్ప స్వామి ఆశీస్సులు అందరి పై ఉండాలి

**మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి**

**రామాయంపేట,డిసెంబర్17(సూర్య రేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలోని హరిహర సుత అయ్యప్ప స్వామి దేవాలయంలో మహా పడిపూజ కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. 41 రోజుల పాటు దీక్ష తీసుకున్న కాట్రియాల గ్రామ బీఆర్ఎస్ నాయకులు రాజేందర్ గుప్తా ఆధ్వర్యంలో అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. స్థానిక మున్సిపల్ చైర్మన్ అయ్యప్ప దేవాలయ కమిటీ వ్యవస్థాపకులు పల్లె జితేందర్ గౌడ్ చేతుల మీదుగా ఈ అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమం నిర్వహించారు. అయ్యప్ప స్వామికి పంచామృతాలతో అభిషేకాలు,అష్టోత్తర నామాలతో పూజ కార్యక్రమం నిర్వహించారు,భక్తి గీతాలు,భజన కీర్తనలతో అయ్యప్ప దేవాలయం మారుమోగింది. అయ్యప్ప మహా




పడిపూజ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మాదేవేందర్ రెడ్డి,నియోజకవర్గ ఇన్చార్జ్ కంటారెడ్డి తిరుపతిరెడ్డి పాల్గొని స్వామి వారికి విశేష పూజా





కార్యక్రమాలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమంలో వారు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. పెద్ద ఎత్తున భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేసిన గుర్తుతెలియని దుండగులు..

**కాపర్ వైన్డింగ్ చోరీ..**

**రైతులు అప్రమత్తంగా ఉండండి కొల్చారం ఏఈ**





**కొల్చారం,డిసెంబర్17(సూర్యరేఖ)** కొల్చారం మండల పరిధిలోని సంగాయిపేట శివారు ప్రాంతంలో ఓ వ్యవసాయ క్షేత్రం వద్ద ఉన్న త్రీఫేస్ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ ని సోమవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేశారు.ట్రాన్స్ఫార్మర్ ధ్వంసం చేసి అందులో విలువైన రాగి వైన్డింగ్ దొంగిలించినట్లు స్థానికులు తెలిపారు. ఈ విషయమై విద్యుత్ ఏఈ హైమత్ అలీని వివరణ కోరగా సంగయ్యపేట శివారు ప్రాంతంలో ట్రాన్స్ఫార్మర్ నుండి వైన్డింగ్ దొంగలించిన విషయం తమ దృష్టికి వచ్చిందన్నారు. సుమారు లక్ష యాభై వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు.గతంలో ఇదే గ్రామానికి చెందిన రైతు శ్రీనివాస్ వ్యవసాయ క్షేత్రం వద్ద ట్రాన్స్ఫార్మర్ వైండింగ్ దొంగతనానికి గురైందని గుర్తు చేశారు. ఈ విషయమై పోలీస్ కేసు నమోదు చేశామని,ఎఫ్ ఐఆర్ ఆధారంగా విషయాన్నిపై అధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే రైతులకు మరో ట్రాన్స్ఫార్మర్ బిగించి ఇస్తామన్నారు.కాగా వరుస దొంగతనాలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు అప్రమత్తంగా ఉండాలని,ముందు ముందు కూడా దుండగులు ట్రాన్స్ఫార్మర్ల దొంగతనానికి పాల్పడే అవకాశం ఉన్నందున, రైతులు ట్రాన్స్ఫార్మర్లు తమ సొంత ఆస్తిగా భావించి చోరీకి గురవకుండా రక్షించాలని రైతులను కోరారు.

## రాజేంద్రనగర్ డివిజన్ విద్యుత్ 1104 యూనియన్ అధ్యక్షులుగా శ్రీహరి,కార్యదర్శిగా అజీమ్





**గండిపేట్,డిసెంబర్ 17** విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం 1104 యూనియన్ నిరంతరం కృషి చేస్తుందని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి సాయిబాబా అన్నారు. మంగళవారం విద్యుత్ ఉద్యోగుల 1104 సంఘం రాజేంద్రనగర్ డివిజన్ ఎన్నికలు మంగళవారం బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్పూర్ లోని పూర్ణగార్డెన్ లో జరిగాయి.నూతన అధ్యక్షులుగా శ్రీహరి,ప్రధాన కార్యదర్శిగా మహమ్మద్ అజీమ్,వర్కింగ్ ప్రెసిడెంట్ గా డి.శ్రీను,అడిషనల్ సెక్రటరీగా రమణలో ఎన్నికయ్యారు. ఈ ఎన్నికలు రాష్ట్ర యూనియన్ ప్రధాన కార్యదర్శి జి.సాయిబాబా ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా సాయిబాబా మాట్లాడుతూ.. 1104 యూనియన్ ఉద్యోగుల సమస్యల పరిష్కారాల కోసం నిరంతరం కృషి చేస్తుందన్నారు.రాజేంద్రనగర్ డివిజన్ ప్రస్తుత కార్యవర్గం బాగా పని చేసిందని రాబోయే మూడేళ్లలో ఇదేవిధంగా పనిచేసే ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలన్నారు. యాజమాన్యం అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిస్కం యూనియన్ ప్రెసిడెంట్ ఏ.వేణు,అడిషనల్ సెక్రటరీ ఎం.భాస్కర్ రెడ్డి,రీజినల్ సెక్రటరీ సుజత్ హుస్సేన్,రీజనల్ సెక్రటరీ లక్ష్మీనారాయణ గౌడ్,రీజినల్ వర్కింగ్ ప్రెసిడెంట్ రామ్ శెట్టి శేషయ్య,స్టేట్ వైస్ ప్రెసిడెంట్ జీవి బాబురావు,రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రెటరీ బి. నరేందర్,తదితరులు పాల్గొన్నారు.ఇతర యూనియన్లకు చెందిన 17 మంది 1104 యూనియన్ లో చేరారని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయిబాబా తెలిపారు.

## లోన్ యాప్ వేధింపులకు యువకుడు బలి..



**రామాయంపేట,డిసెంబర్17(సూర్య రేఖ)** మెదక్ జిల్లా రామాయంపేట మండలంలో లోన్ యాప్ వారి వేధింపులకు ఓ యువకుడు బలయ్యాడు.కాట్రియాల గ్రామానికి చెందిన మద్ది గంగాధర్ (30) మండలంలో మిషన్ భగీరథలో కాంట్రాక్ట్ పై జాబ్ చేస్తున్నాడు.కాగా లోన్ యాప్ లో సుమారు రూ.3 లక్షల వరకు అప్పు చేశాడు.అవి తీర్చకపోవడంతో వారి వేధింపులు ఎక్కువై గత మూడు రోజుల క్రితం పురుగుల మందు తాగి చికిత్స నిమిత్తం ఎల్లారెడ్డిపేట తరలించారు.అక్కడ పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ తరలించారు.అక్కడ ట్రీట్మెంట్ పొందుతూ ఇవాళ పొద్దున్నమరణించాడు.

సూర్య
బుధవారం 18 డిసెంబర్ 2024

# అట్టహాసంగా ప్రారంభమైన అభయాంజనేయ స్వామి ఉత్సవాలు





**ప్రథమ వార్షికోత్సవ కార్యక్రమాలో సీతారామచంద్రస్వామి కళ్యాణోత్సవం**

**అన్నదానం యాగం ప్రసాద వితరణ ఊరేగింపు కార్యక్రమం**

**కార్యక్రమంలో మాజీ మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి పూజలు**

**హనుమాన్ స్వాములు నిరంతర రామనామ జపం**

**రామాయంపేట,డిసెంబర్17(సూర్య రేఖ)** రామాయంపేట పట్టణంలో గత సంవత్సరం నిర్మించిన హనుమాన్ సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయ ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. అంకురార్పణ కార్యక్రమంలో అనంతరం మంగళవారం శ్రీ సీత రామస్వామి కళ్యాణోత్సవాన్ని నిర్వాహకులు వేద పండితులతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉదయం నుండి స్వామివారి కల్యాణానికి ప్రత్యేక అలంకరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున భక్తులకు ప్రసాద వితరణ అన్నదాన కార్యక్రమాన్ని కూడా నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. శ్రీ సీతారామస్వామి కళ్యాణం పురోహితుల సమక్షంలో భక్తుల ముందు ఘనంగా నిర్వహించారు. హెూమం నిర్వహించి అనంతరం హనుమాన్ స్వాముల చేత నిరంతర రామ నామ స్మరణ కార్యక్రమం కొనసాగింది. అన్నదాన కార్యక్రమం అనంతరం సాయంత్రం స్వామివారిని పల్లకి ఊరేగింపు ఆలయం నుండి పట్టణ పురవీధులలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి,బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గాజవాడ నాగరాజు స్వామివారికి ఘనంగా పూజ నిర్వహించారు. మూడు రోజుల ప్రథమ వార్షిక కార్యక్రమం బుధవారంతో ముగుస్తుందని భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని శ్రీ అభయాంజనేయ స్వామి కృపకు పాత్రులు కావాలని హనుమాన్ సేవాసమితి గురుస్వామి బక్కన్న గారి లాల గౌడ్ స్వామి కోరారు. ఊరేగింపు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భక్తులు హనుమాన్ స్వాములు పాల్గొని రామనామ స్మరణతో భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.

## గోరక్ష మహాపాదయాత్ర

**స్వాగతం పలికిన సగర సంగం తెలంగాణ యూత్ ప్రెసిడెంట్ మర్క నవీన,సగర సురేష్ సగర దంపతులు**



**రామాయంపేట,డిసెంబర్17(సూర్య రేఖ)** గోరక్షణ,భూ రక్షణ,పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని,గోమాత లేనిదే మానవ మనగడ లేదని బాలకృష్ణ గురుస్వామి అన్నారు. గోవుల రక్షణ కోసం అఖిల భారత గో సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన గో రక్ష మహాపాదయాత్ర మెదక్ జిల్లా తూప్రాన్ చేరుకుంది. కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు బాలకృష్ణ గురుస్వామి గోమాతతో చేస్తున్న పాదయాత్రకు సగర సంగం యూత్ అధ్యక్షులు మర్కు సురేష్,సగర నవీన సగర దంపతులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..ఎరువులు క్రిమిసంహారక మందులు వాడడం వల్ల విషతుల్యమైన ఆహారం తింటున్నామని,తద్వారా ఎంతోమంది అనారోగ్యాల భారీన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ప్రతిరోజు 50 వేలకు పైగా ఆవులు వధకు గురవుతున్నాయని,గోవులను రక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన పిలుపునిచ్చారు. నేటికీ 82 రోజులపాటు ఈ పాదయాత్ర పూర్తయిందని 2530 కిలోమీటర్లు పాదయాత్ర చేసినట్టు ఆయన తెలిపారు. పాదయాత్రకు స్వాగతం పలికిన దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు.

## మన ఊరు- మన బడి పథకం కింది పాఠశాలలను పూర్తి చేయండి

**ప్రభుత్వానికి సూచించిన మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి**

**హైదరాబాద్ :** గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మన ఊరు ? మన బడి పథకాన్ని మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి శాసనమండలిలో ప్రస్తావించారు. మన ఊరు ? మన బడి పథకం కింద మొదలుపెట్టిన పాఠశాలల బిల్లులు చెల్లించి, ఆ పాఠశాలలను పూర్తి చేయండి అని కాంగ్రెస్ ప్రభుత్వానికి గుత్తా సుఖేందర్ రెడ్డి సూచించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన మన ఊరు ? మన బడి పథకం కింద చాలా గ్రామాల్లో పాఠశాల భవనాలు అసంపూర్తిగా ఉన్నాయి. కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాల్సిన అవసరం ఉంది. ఉదాహరణకు నా ఊర్లోనే మన ఊరు ? మన బడి పథకం కింద జిల్లా పరిషత్ హైస్కూల్‌ను తీసుకున్నారు. స్లాబ్ వేశారు. గోడలు, కిటికీలు లేవు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం.. ఆ పథకాన్ని అమ్మ ఆదర్శ పాఠశాలలుగా మార్చింది. అసంపూర్తిగా మిగిలి ఉన్న భవనాలను పూర్తి చేస్తే బాగుండేది. కాబట్టి మీరు మన ఊరు ? మన బడి పథకం కింద నిర్మించిన భవనాల కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించాలి. అంతేకాకుండా మిగిలి ఉన్న పనులను వీలైనంత త్వరగా పూర్తి చేస్తే బాగుంటుంది. పిల్లలు చెట్ల కింద కూర్చొనే పరిస్థితి వచ్చింది. ఎందుకంటే చాలా చోట్ల భవనాలు సగం నిర్మాణాల వద్దే ఆగిపోయాయని గుత్తా సుఖేందర్ రెడ్డి తెలిపారు. స్పెషల్ డ్రైవ్ కింద ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకొని వీటిని పూర్తి చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి తీసుకెళ్లారు.

## హయత్ నగర్‌లోని నారాయణ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థి ఆత్మహత్య

**హైదరాబాద్ :** రంగారెడ్డి జిల్లా హయత్ నగర్ లోని నారాయణ రెసిడెన్షియల్ స్కూల్లో విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఏడో తరగతి విద్యార్థి లోహిత్ రెడ్డి రాత్రి ఊరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఫిజిక్స్ ఉపాధ్యాయుడు క్లాస్ రూమ్ లో క్లాస్ లీడర్ తో కొట్టించడంతో పాటు ఉపాధ్యాయుడు వేధింపులకు గురి చేయడంతో విద్యార్థి మృతి చెందాడని బంధువులు ఆరోపణలు చేస్తున్నారు. విద్యార్థి మృతి చెందిన విషయం పోలీసు వారు చెప్తే కానీ తమకు తెలియ లేదని ఇప్పటికి కూడా స్కూల్ యాజమాన్యం ఏం జరిగిందో చెప్పట్లేదని కుటుంబ సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థి స్వస్థలం వనపర్తి జిల్లాగా గుర్తించారు.

## క్షయ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్ శ్రీనివాస్**

**జగిత్యాల :** క్షయ నివారణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా ఉపవైద్యాధికారి డాక్టర్ ఎన్. శ్రీనివాస్ అన్నారు. జగిత్యాల అర్బన్ ఆరోగ్య కేంద్రంలో క్షయ విజేతలకు టీబి అలర్ట్ ఇండియా, ఇంపాక్ట్ ఇండియా ప్రాజెక్టు ఆధ్వర్యంలో ఒక్క రోజు శిక్షణ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు.. ఈ సందర్భంగా క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలపై వివరించారు.

## పెన్షనర్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలి

**జిల్లా ట్రెజరీ అధికారి సీ. హెచ్. సోఫియా.**

**టీ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా జాతీయ పెన్షనర్ల దినోత్సవ వేడుకలు.**

**86 మంది విశిష్ట పెన్షనర్లకు పురస్కారాలు.**



**జగిత్యాల :** పెన్షనర్లను ప్రతి ఒక్కరూ గౌరవించాలని జిల్లా ట్రెజరీ అధికారి సీ.హెచ్.సోఫియా అన్నారు. జిల్లా కేంద్రంలోతెలంగాణ పెన్షనర్స్ సెంట్రల్ అసోసియేషన్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో సీనియర్ సిటీజేన్స్ కౌన్సెలింగ్ కేంద్రంలో మంగళవారం జరిగిన జాతీయ పెన్షనర్ల దినోత్సవం లో ముఖ్యఅతిథిగా సోఫియా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి పెన్షనర్ల పితామహుడు నకారా చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. 86 మంది విశిష్ట పెన్షనర్లను పురస్కారాలతో ఘనంగా సన్మానించారు. పెన్షనర్లకు పొదుపు పథకాలపై ఐ.సి.ఐ.సి.ఎస్.బ్యాంకు మేనేజర్ రాజ్ కుమార్ ,సఖీ సేవలపై అడ్మిన్ లావణ్య లు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా ట్రెజరీ అధికారి సోఫియా మాట్లాడుతూ కనీస సదుపాయాలు లేని మారు మూల ప్రాంతాల్లో ఉద్యోగులు,పెన్షనర్లు ప్రజలకు సేవలందిస్తూ ప్రభుత్వ కార్యక్రమాలను విజయవంతం చేశారన్నారు. ప్రస్తుతం పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి, గతంలో ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి హరి ఆశోక్ కుమార్ చేస్తున్న వివిధ సామాజిక సేవలను,సంఘ సభ్యులను అభినందించారు. జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్ మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమ రాష్ట్ర అధ్యక్షుడు గాజుల నర్సయ్య ఆధ్వర్యంలో రాజీ లేని పోరాడిన చేస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సత్వరం స్పందించి పెన్షనర్లకు ప్రతి నెల మొదటి తేదీనే పెన్షన్లు అందించడం హర్షణీయమన్నారు. అలాగే పెండింగ్ డి.ఏ.లు విడుదల చేయాలని, పీ.ఆర్.సి.ఫిట్మెంట్ 52 శాతం ఇవ్వాలని,అన్ని కార్పోరేట్ ఆసుపత్రుల్లో నగదు రహిత వైద్యసేవలు అందించాలని,రిటైర్మెంట్ ప్రయోజనాలు సత్వరం చెల్లించాలని, తదితర ప్రధాన డిమాండ్ల తో పాటు,కేంద్ర ప్రభుత్వం పెన్షనర్లకు ఆదాయపు పన్ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎ.టి.ఓ.మధు కుమార్, ఎస్.టి.ఓ. గణేష్, అసిస్టెంట్ రవి,జిల్లా పెన్షనర్స్ అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,సహాయ అధ్యక్షుడు పి.హన్మంత రెడ్డి,కోశాధికారి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు వి.ప్రకాష్ రావు,,ఎం.డి.యాకూబ్,ఆర్గనైజింగ్ కార్యదర్శి పి.ఆశోక్ రావు, సంయుక్త కార్యదర్శి దిండిగాల విఠల్,జగిత్యాల యూనిట్ అధ్యక్షుడు బి.రాజేశ్వర్ ,ధర్మపురి యూనిట్ అధ్యక్షుడు కండ్లే గంగాధర్,కార్యదర్శి దుబ్బేశం,మెట్ పల్లి అధ్యక్షుడు వి.ప్రభాకర్ రావు,రాయికల్ అధ్యక్షుడు వై.వేణుగోపాల్ రావు,మల్యాల అధ్యక్షుడు యాకూబ్, కార్యదర్శి వీరారెడ్డి, తొగిటి గంగాదర్,

## ప్రివిలేజ్ గురించి బిఆర్ఎస్ వాళ్లు మాకు చెప్పే హక్కులేదు

**సభా నియమాలకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ నాయకులు ప్రవర్తిస్తున్నారు**

**ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**

**హైదరాబాద్ :** తెలంగాణ ప్రజలకు గత ప్రభుత్వ లోపాలు చూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా శాసన సభలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. తప్పులు కప్పిపుచ్చుకోవడానికి బిఆర్ఎస్ నాయకులు ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. సభ చర్చను తప్పు దారి పట్టిస్తున్నారని, గతంలో ఇదే సభలో డబుల్ బెడ్ రూం ఇల్లులు ఇస్తామని అన్నారని, సభలో కీలకమైన చర్చలు జరిగేటప్పుడు భంగం కలిగిస్తున్నారని భట్టి దుయ్యబట్టారు. ప్రివిలేజ్ గురించి బిఆర్ఎస్ వాళ్లు మాకు చెప్పే హక్కులేదని, సభా నియమాలకు వ్యతిరేకంగా బిఆర్ఎస్ నాయకులు ప్రవర్తిస్తున్నారని ధ్వజమెత్తారు. రూ. లక్షల కోట్ల అప్పు తాము చేయలేదని, ఇప్పటి వరకు రూ.52 వేల కోట్లు అప్పులు మాత్రమే తాము తీసుకున్నామని, గత ప్రభుత్వం చేసిన అప్పులకు తాము వడ్డీలకు కడుతున్నామని, సివిల్ సప్లై బిల్లులు కూడా రూ.62 వేల కోట్లు అప్పు చేసి పెట్టామన్నారు. ప్రస్తుతం రైతులు పండించిన ప్రతి పంటను కొంటున్నామని తెలియజేశారు. బిఆర్ఎస్ ప్రభుత్వం రూ. 40 వేట కోట్ల బిల్లులు పెండింగ్‌లో పెట్టిపోయారని భట్టి చురకలంటించారు.

## మూసి విషయంలో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు



**హైదరాబాద్ :** శాసన మండలిలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేసారు. మూసి నది విషయంలో డీపీఆర్ ఆధారంగా అంచనా వ్యయాలు ఉంటాయని ప్రభుత్వం చెబుతోంది. కానీ 4100 కోట్లు కావాలని ప్రపంచ బ్యాంకును ప్రభుత్వ ఆశ్రయించినట్లు నిర్ధిష్టమైన సమాచారం ఉంది మాకని అన్నారు. ప్రపంచ బ్యాంకును ప్రభుత్వం ఆశ్రయించిన విషయం వాస్తవమా కాదా ? డీపీఆర్ తయారు కాలేదని ప్రభుత్వం ఈ రోజు సభకు చెప్పింది. ఏ తేదీన ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు సాయం కోరుతూ ప్రతిపాదనలు పంపించింది. మూసి కోసం రూ 14,100 కోట్ల వ్యయం అవుతుందని, నిధులతో పాటు అనుమతులు ఇప్పించాలని ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని ఏ ప్రాతిపదికన అడిగారు. ఒక వేళ కేంద్రాన్ని సాయం కోరడం, ప్రపంచ బ్యాంకు సాయం కోరడం వాస్తవమైతే సభను, ప్రజలను ఎందుకు తప్పుదోవ పట్టిస్తున్నారు ? సభను తప్పుదోవ పట్టిస్తే అవసరమైతే... ప్రివిలేజ్ మోషన్ ను ప్రవేశపెడుతామని అన్నారు. మూసీ నదిగర్భంలో నివసించే 309 కుటుంబాలు వాళ్లంతట వాళ్లు ఖాళీ చేసి వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోంది. కానీ హృదయవిదారకమైన వీడియోలను చూస్తే ప్రభుత్వం చెబుతున్నది అవాస్తవమని స్పష్టమవుతోంది. ఆ 309 కుటుంబాలు సమ్మతిస్తూ ఏవైనా పత్రాలపై సంతకాలు చేసి ఉంటే అవి సభకు అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. 181 కుటుంబాలు తామంతట తామే కూల్చేసుకొని వెళ్లిపోయారని ప్రభుత్వం చెబుతోంది? ఇది వినడానికి కూడా హాస్యాస్పదంగా ఉంది. మూసీ నిర్వాసితుల విషయంలో మానవీయ కోణంలో ఆలోచించాలి. కూలగొట్టిన ఇళ్లకు ఉంటే ఈఎంఐలను ప్రభుత్వం చెల్లిస్తుందా అని ప్రశ్నించారు.

## ప్రభు ఆశీర్వాదం తీసుకున్న కురుమ సంఘం నేతలు



**ఆందోల్,డిసెంబర్17(సూర్య రేఖ)** దత్త జయంతి మహెూత్సవము 2024 మాణిక్ నగర్ హుమ్నాబాద్ దర్బార్ లో పాల్గొని సంగారెడ్డి జిల్లా కురుమ యువత ప్రధాన కార్యదర్శి బండారి పాండు కురుమ ప్రభు ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో గంజి విట్టల్ కురుమ,హస్నాబాద్ రాయికోడ్ మండలం మాజీ ఎంపీటీసీ ఏడాకులపల్లి నరసింహులు కురుమ,మండల కురుమ సంఘం యువ నాయకుడు పులగం ఆంజనేయులు, ప్రభాకర్లు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీలో పార్టీ బిజెపి దేశ వ్యతిరేక పార్టీ

**మాయమాటలతో మోసం చేసేది బీఆర్ఎస్,బీజేపీలు**

**అన్ని మతాలకు సమానంగా సహకరిస్తాం**

**మెదక్ ఎమ్మెల్యేను చూసి భయపడుతున్న బీజేపీ,బీఆర్ఎస్ పార్టీలు**

**తెలంగాణ అధికార కాంగ్రెస్ ప్రతినిధి పల్లె రామచంద్ర గౌడ్**




**రామాయంపేట,డిసెంబర్17(సూర్య రేఖ)** బీజేపీ,బీఆర్ఎస్‌లకు కాంగ్రెస్ పార్టీని విమర్శించే హక్కు ఏమాత్రం లేదని తెలంగాణ కాంగ్రెస్ అధికార ప్రతినిధి పల్లె రామచంద్ర గౌడ్ అన్నారు. ఆయన తన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ..రాష్ట్రమంతా అప్పులు చేసి రాజకీయంగా తప్పులు చేసి ప్రజల చేతుల్లో చిత్తుగా ఓడిపోయిన బీఆర్ఎస్ కు బుద్ధి రావడం లేదని అన్నారు. అధికారం లేకుండా ఒక సంవత్సరం కూడా ఉండ లేకపోతుందన్నారు. ప్రజల సొమ్మును దోచుకున్న బీఆర్ఎస్ నాయకులకు కాంగ్రెస్ పార్టీ ప్రజలకు చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక అనవసరంగా రాద్ధాంతం చేస్తున్నారని ఆయన అన్నారు. తాము అధికారంలో ఉన్నప్పుడు చేసిన అప్పులు ఇప్పుడు కూడా కాంగ్రెస్ పార్టీ వడ్డీలు కడుతున్నరన్నారు. బీజేపీ పార్టీ క్రైస్తవులకు పండుగలకు ఇస్తున్న ప్రభుత్వపు సౌకర్యాలను ప్రశ్నించడం అవివేకమన్నారు. రాష్ట్రంలో అన్ని మతాలకు ప్రభుత్వం సమాన దృష్టితో చూస్తుందన్నారు. సిక్కులకు ఈసాయిలకు అలాగే అన్ని మతాల వారికి సమాన సౌకర్యాలు అందిస్తామని ఆయన అన్నారు. దీన్ని ప్రశ్నించడానికి బీజేపీకి ఏ మాత్రం హక్కు లేదన్నారు. మత తత్వ పార్టీగా బిజెపి వ్యవహరిస్తుందన్నారు. బీఆర్ఎస్ అధికారం లో ఉన్నప్పుడు అందరికీ బైకులు ట్రాక్టర్లు ఇస్తామన్న మాట ఏమైందని ఆయన ప్రశ్నించారు. బీజేపీ మోడీ ప్రతి ఒక్కరికి 15 లక్షలు జమ చేస్తామని ఇచ్చిన మాట ఎక్కడికి పోయిందని అన్నారు. తప్పులన్నీ తమ వద్ద ఉంచుకొని కాంగ్రెస్ పార్టీని విమర్శిస్తే ఊరికనేది లేదన్నారు. ప్రజల కోసం దేశం కోసం కాంగ్రెస్ పార్టీ ముందుకు వెళుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కోనాపూర్ ప్రాథమిక వ్యవసాయ కమిటీ సభ్యులు సిద్ధ రాములు,జిల్లా సేవదళ్ అధ్యక్షుడు జహీరుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# వినోదాత్మక దర్శకుడితో చిరంజీవి సినిమా.. నవ్వులే నవ్వులు..

చిరంజీవి జోరు మీద సినిమాలు చేస్తున్నారు. యువ హీరోలతో సమానంగా వరుస సినిమాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆయన వసిష్ఠ దర్శకత్వంలో 'విశ్వంభర' చిత్రంలో నటిస్తున్నారు. కొత్త ఏడాదిలో ఈ చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించనున్నారు. ప్రస్తుతం షూటింగ్ ముగింపు దశలో ఉంది. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తారు. ఇటీవల 'దసరా చిత్ర దర్శకుడు శ్రీకాంత్ ఓదెలతో ఓ సినిమా ప్రకటించారు, దీని తర్వాత చిరు.. దర్శకుడు అనిల్ రావిపూడితో ఓ సినిమా చేసేందుకు సిద్ధమవుతున్నారు. దీన్ని షైన్ స్క్రీన్ పతాకంపై సాహు గారపాటి నిర్మించనున్నట్లు సమాచారం. అనిల్ గత చిత్రాలకు పూర్తి భిన్నమైన కథాంశంతో యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రం ఉండబోతోందని సమాచారం. వచ్చే ఏడాది ఏప్రిల్‌లో ఈ సినిమా పట్టాలెక్కనున్నట్లు సమాచారం. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై అధికారికి ప్రకటన వచ్చే అవకాశముంది. అనిల్ సినిమా తర్వాత శ్రీకాంత్ ఓదెలతో సినిమా ప్రారంభమవుతుందని టాక్.



# నిధులు కాపాడుకుంటూ వస్తోన్న భూతం..


## ఇంట్రెస్టింగ్‌గా మోహన్ లాల్ బరోజ్ ట్రైలర్

మలయాళ స్టార్ హీరో మోహన్ లాల్ బ్యాక్ టు బ్యాక్ సినిమాల్లో నటిస్తున్నాడని తెలిసిందే వీటిలో ఒకటి బరోజ్ మోహన్‌లాల్ స్వీయదర్శకత్వం వహిస్తున్నాడు. మేకర్స్ తాజాగా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఆ డిగామా బంగ్లాలోపల ఎవరికీ కనిపించని భూతం ఉందంటూ ఓ చిన్నారి వాయిస్ ఓవర్‌తో మొదలైంది ట్రైలర్. వందల సంవత్సరాలుగా నిధులు కాపాడుకుంటూ వస్తోన్న భూతం. మిగితా వారి కోసం కార్చే కన్నీరు కంటే మహత్తరమైన నిధి ఈ లోకంలో మరేది లేదంటున్నాడు బరోజ్. నిధుల తోటకు కాపాలా ఉండే బరోజ్ కథ నేపథ్యంలో సినిమా ఉండబోతున్నట్టు ట్రైలర్ చెప్పకనే చెబుతోంది. మోహన్‌లాల్ స్వీయదర్శకత్వంలో వస్తోన్న చిత్రం కనకపు సింహాసనంపై రాజసం ఉట్టిపడేలా కనిపిస్తూ.. సినిమాపై హైప్ పెంచేస్తున్నాడు. కథనందిస్తున్న ఈ మూవీని ఆశీర్వాద్ సినిమాస్ బ్యానర్‌పై ఆంటోనీ పెరంబవూరు తెరకెక్కిస్తున్నారు. మోహన్ లాల్ మరోవైపు నందకిశోర్ దర్శకత్వంలో పాన్ ఇండియా మూవీ వృషభ లో కూడా నటిస్తున్నాడు. తెలుగు, మలయాళ బైలింగ్యువల్ చిత్రంగా వస్తోన్న ఈ చిత్రంలో టాలీవుడ్ నటుడు రోషన్ మేక కీలక పాత్రలో నటిస్తున్నాడు. అదేవిధంగా కన్నప్పతోపాటు %=ఖఎ, ఙఎఝ్ఖఅ, ూ2: జుఎజూబతీఝ్ఖఅ% మోహన్ లాల్ ఖాతాలో ఉన్నాయి.



# నితిన్ సినిమా వెనక్కి వెళ్లింది

నితిన్ హీరోగా వెంకీ కుడుముల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'రాబిన్ హుడ్' మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మిస్తోంది. ఈ చిత్రం డిసెంబర్ 25న ప్రేక్షకుల ముందుకు రావాల్సి ఉంది. అయితే ఈ చిత్రాన్ని వాయిదా వేస్తున్నట్లు నిర్మాణసంస్థ ప్రకటించింది. అనుకోని పరిస్థితుల వల్ల సినిమాను వాయిదా వేయాల్సి వచ్చిందంటూ మైత్రీ మూవీస్ పోస్ట్ పెట్టింది. త్వరలోనే కొత్త విడుదల తేదీని ప్రకటిస్తామని తెలిపింది. నితిన్- వెంకీ కుడుముల కలయికలో రానున్న రెండో చిత్రమిది. శ్రీలీల కథానాయిక. ప్రస్తుతం షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఇటీవల చిత్రబృందం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లోనూ షూటింగ్ అప్‌డేట్ పంచుకుంది. షూటింగ్ దాదాపు పూర్తయిందని ఒక్క పాట మాత్రమే మిగిలి ఉందని చెప్పారు. అయితే పోస్ట్ ప్రొడక్షన్ వర్క్ కారణంగా సినిమా విడుదల ఆలస్యమైనట్లు సమాచారం. నితిన్ కెరీర్‌లో అత్యంత భారీ బడ్జెట్ మూవీగా ఈ సినిమా తెరకెక్కుతోంది. ఇటీవల విడుదలైన టీజర్, పాటలు మంచి ఆదరణను సొంతం చేసుకున్నాయి.



# విడుదల పార్ట్ 2 లెంగ్త్ రన్ టైంతో వెట్రిమారన్ టీంకు మరో ఛాలెంజ్?

కోలీవుడ్ దర్శకుడు వెట్రిమారన్ డైరెక్షన్‌లో విజయ్ సేతుపతి లీడ్ రోల్‌లో నటిస్తోన్న చిత్రం విడుదల పార్ట్ 2 ఈ మూవీ డిసెంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా కన్నడ, తెలుగు, తమిళం, మలయాళం, హిందీ భాషల్లో గ్రాండ్‌గా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ప్రమోషన్స్‌లో బిజీగా ఉంది టీం. కాగా తాజాగా ఆసక్తికర చర్చ ఒకటి నెట్టింట జరుగుతోంది. సీక్వెల్ రన్ టైం 2 గంటల 52 నిమిషాలు (172 నిమిషాలు). అయితే ఫస్ట్ పార్ట్‌తో పోలిస్తే కేవలం ఈ రన్ టైం 2 నిమిషాలే ఎక్కువ. పార్ట్ 1 లో తెలుగు వెర్షన్ విషయానికొస్తే రిలీజ్ సమయంలో రన్ టైం టాక్ ఆఫ్ ది పాయింట్‌గా నిలిచింది. పార్ట్ 1 లో స్లో నరేషన్ ప్రేక్షకులను రెండు పార్టులుగా డివైడ్ చేసింది. బలమైన కథాంశం ఉన్నప్పటికీ తెలుగు ప్రేక్షకుల నుంచి మిశ్రమ స్పందన రాబట్టుకుంది. ఇప్పుడిక ఇదే లైన్‌లో సీక్వెల్ కూడా వస్తుండటంతో మరి తెలుగు ప్రేక్షకులు ఎలా రిసీవ్ చేసుకుంటారనేది ఆసక్తికరంగా మారింది. స్టోరీ టెల్లింగ్‌తో ఇంప్రెస్ చేసే వెట్రిమారన్ టీంకు రన్ టైం మాత్రం మరోసారి ఛాలెంజ్ కానుందంటూ ట్రేడ్ పండితులు అభిప్రాయపడుతున్నారు. మరి కంటెంట్ బాగుంటే చాలు ప్రేక్షకులు వాటన్నింటిని వెనక్కినెట్టేస్తారని సీక్వెల్ నిరూపిస్తుందా..? లేదా అనేది సర్వత్రాఉత్కంఠ నెలకొంది.

Ediited Printed & Published Mekkonda Premraj on behalf MPR publications and Printed RNI NO:TELTEL/ 2023/89546 Cell No.9397303326,